# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం, 24 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి




## రైతులకు ఆధునిక టెక్నాలజీలను అందించాలి



- డిమాండ్ ఉన్న పంటలనే రైతులు సాగు చేయాలి
- వ్యవసాయ వర్సిటీలో విత్తన వారోత్సవాలు ప్రారంభించిన మంత్రి తుమ్మల

హైదరాబాద్,మే23 : భవిష్యత్ వ్యవసాయ రంగంలో కూలీల సమస్య అధికమయ్యే అవకాశం ఉన్నందున డ్రోన్స్ వినియోగం ప్రాముఖ్యతని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేసారు. తదనుగుణం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డ్రోన్ ఆధారిత వివిధ వ్యవసాయ విధానాల్ని మంత్రి అభినందించారు. రాజేంద్ర నగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈరోజు పర్యటించారు. తొలుత మంత్రి గత ఏడాది స్థాపించిన సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్, టెక్నాలజీ ని సందర్శించి ఆధునిక డ్రోన్స్ వినియోగం పై చేస్తున్న పరిశోధన ల గురించి తెలుసుకున్నారు. అదే విధంగా ఇటీవల అభివృద్ధి చేసిన రోబోటిక్స్ మరియు సెన్సర్ బేస్డ్ ప్రయోగశాలని సందర్శించి ఇప్పటికే కొన్ని రోబోలని వ్యవసాయ రంగం లో ఉపయోగించే విధంగా అభివృద్ధి చేసినందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలని మంత్రి అభినందించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వానికి అందించిన ఉపగ్రహ ఆధారిత గణాంకాల గురించి తెలుసుకున్నారు. రాష్ట్రం లోని రైతాంగం యాజమాన్యం పరిధి లో ఉన్న మొత్తం భూమి లో సుమారు 9.3 శాతం భూమి సాగు లో లేదని ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగం గా వ్యవసాయ విశ్వవిద్యాలయం తలపెట్టిన విత్తన వారోత్సవాలు కార్యక్రమాన్ని మంత్రి లాంఛనం గా ప్రారంభించి పది మంది రైతులకు వివిధ పంటలకి చెందిన నాణ్యమైన మూల విత్తనాలని పంపిణీ చేశారు. విశ్వవిద్యాలయం ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం చాలా అభినందనీయం అని మంత్రి అన్నారు.కొన్ని విత్తన కంపెనీల మాయ మాటలకి మోసపోకుండా రైతులు ఈ నాణ్యమైన విత్తనాలు వినియోగించి తక్కువ ఖర్చు తో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అదే విధంగా రైతులు మార్కెటింగ్ అవకాశాలు ఉన్న మిగతా 3లో..

## భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం

- అమెరికాకు భారత్ కీలక భాగస్వామి
- ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు



న్యూఢిల్లీ, మే 23 : భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వైట్‌హౌస్‌ను సందర్శించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరఫున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవాతీర్థ్ లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా మిగతా 3లో..

# గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

- జూనియర్ కాలేజీల్లో మహద్యాహ్న భోజనం
- గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం
- కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు
- తెలంగాణ కేబినెట్ నిర్ణయం



హైదరాబాద్, మే 23: వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటా యిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశా లల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశా లల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ ఎఫ్, మిగతా 3లో..

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్



- వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు
- మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పున పరిహారం
- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటీ సమీక్ష

మిగతా 3లో..

## యాదగిరిగుట్టలో సిఎం పర్యటన



- వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ

2లో..

## తెలుగు రాష్ట్రాల్లో మండుటెండలు

- కొత్తగూడెంలో అత్యధికంగా 47 డిగ్రీలు



హైదరాబాద్,మే24 : తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. తెలంగాణలో 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటాయి. కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 46.3 డిగ్రీలు నమోదైంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో.. కృష్ణా జిల్లా కానుమోలులో అత్యధికంగా 45.8 డిగ్రీలు నమోదైంది. 13 జిల్లాలోని 95 మండలాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటాయి. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో శనివారం 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.

## అంతర్జాతీయ ప్రభావాలపైనే మారకం విలువ

- ఇందులో ప్రభుత్వం జోక్యం ఉండదన్న గోయల్

న్యూఢిల్లీ,మే 23 : ఎక్స్ఛేంజీ రేట్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండదని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. రూపాయి విలువ అనేక అంతర్జాతీయ అంశాలు, మార్కెట్‌లపై ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన 19వ రోజ్‌గార్ మేళాలో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వం ఎప్పుడూ ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే, రెండు, మూడు రోజులుగా చూస్తే.. రూపాయి బలపడుతుండటాన్ని గమనించవచ్చన్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ ఇటీవల కనిష్ఠ స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. అయితే, మార్కెట్ సూచీలు పుంజుకోవడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో రెండు రోజులుగా రూపాయి కొంత బలపడుతోంది. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల పురోగతిపై ఆశలు పనిచేసినట్లు మార్కెట్ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు




- పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు

న్యూఢిల్లీ,మే24 : పెట్రోల్ డీజిల్ ధరలు వరుసగా మూడోసారి పెరిగాయి. శనివారం పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం 91 పైసలు పెంచింది. 10 రోజుల్లో ధరలు పెంచటం ఇది మూడోసారి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు విషయంలో ఆయిల్ కంపెనీలు ఓ ప్యాట్రన్ ఫాలో అవుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ నడుస్తుంది. ఇప్పటి వరకు నాలుగు రోజులకు ఒకసారి పెంచటం జరిగింది. 15వ తేదీ తర్వాత 19.. ఆ తర్వాత 23వ తేదీ.. అంటే ధరల పెంపు మధ్య 4 రోజుల గ్యాప్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇదే సమయంలో మరో ఆసక్తికరమైన అంశంపై సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. గతంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును రాత్రి టైంలో అనౌన్స్ చేసేవాళ్లు.. రేపటి ఉదయం పత్రికల్లో ఆ వార్త వచ్చేసింది. ఇప్పుడు ఈ విధానం మారింది. అర్ధరాత్రి తర్వాత.. తెల్లవారుజామున ధరల పెంపు ప్రకటన మిగతా 3లో..

## వ్యాపార ఎదుగుదలకు తోడ్పడాలి



### చార్టెడ్ అకౌంటెంట్లకు కెటిఆర్ హితవు

హైదరాబాద్, మే 23: చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు. గచ్చిబౌలిలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర అత్యంత కీలకమని.. ట్యాక్స్‌లు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో వారి అవసరం చాలా ఉందన్నారు. సీఏలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన సత్కరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని ఎప్పటికీ మరువకూడదని.. వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు.

## ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ



### గుర్తుండి పోయే మధుర క్షణం అంటూ పోస్ట్

న్యూఢిల్లీ,మే24 :కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం కుటుంబంతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తల్లి ప్రధాన మంత్రికి మొక్కను బహుకరించారు. కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని కలవటంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో.. 'ఈ రోజు మా కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే ఓ భావోద్వేగ క్షణం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిసే అదృష్టం కలగడం ఎంతో ఆనందంగా, గర్వంగా భావిస్తున్నాను'.. ఆయన అసాధారణ వ్యక్తిత్వం, ఆప్యాయత మా కుటుంబంలోని మూడు తరాలను ఒకేలా ఆకట్టుకుంది. ప్రజల హృదయాల్లో ఆయన ఎందుకు అపారమైన ఆదరణ పొందారో ఆ క్షణంలో మరింత స్పష్టంగా తెలిసింది. ప్రత్యేకంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే మహత్తర ఆలోచనకు ప్రేరణగా నా తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించడం మా కుటుంబానికి ఎంతో మధురమైన, గర్వకారణమైన క్షణంగా నిలిచిపోతుంది. ఆయన చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులకు మేమెప్పటికీ కృతజ్ఞులమే. మాతో గడిపిన అమూల్యమైన సమయానికి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు' అని అన్నారు.

# ట్విశా శర్మ మృతిలో వీడని మిస్టరీ

- ఆత్మహత్యకు ముందు సెలూన్‌ను సందర్శించినట్లు గుర్తింపు



ముంబై,మే23 : దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన మాజీ మిస్ పుణె, ఎంబీఏ గ్రాడ్యుయేట్ ట్విషా శర్మ మృతి కేసుకు సంబంధించి పలు కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆమె ఇంట్లో ఉరివేసుకుని కనిపించడానికి కొన్ని గంటల ముందే ఓ సెలూన్ షాప్‌ను సందర్శించింది. సంబంధిత సీసీటీవీ ఫుటేజీ బయటకు వచ్చింది. సుమారు 3 గంటలసేపు సెలూన్‌లో ఉన్న ట్విషా.. హెడ్ మసాజ్, పెడిక్యూర్ చేయించుకున్నట్టు కనిపిస్తోంది. ట్విషా.. మే 12న మధ్యాహ్నం 3:12 గంటల ప్రాంతంలో సెలూన్‌లోకి వెళ్లి, సాయంత్రం 6:15 గంటలకు బయటకు వెళ్లారని సెలూన్ షాప్ యజమాని కిరణ్ పారిహార్ తెలిపారు. ఆ తర్వాతి రోజు ట్విషా అత్త గిరిబాలా సింగ్ ఆమె వివరాలపై పదే పదే ఆరా తీశారన్నారు. 'ట్విషా శర్మ.. మా సెలూన్‌కు తరచుగా వస్తుంటారు. గతంలోనూ ఆమె నాలుగైదుసార్లు వచ్చారు. అయితే.. ఈసారి సుమారు 9 నెలల విరామం తర్వాత వచ్చారు. మరుసటి రోజు ఉదయం గిరిబాల సింగ్.. ట్విషా సెలూన్‌కు వచ్చినప్పటి సీసీటీవీ ఫుటేజీ కావాలని ఫోన్ చేశారు' అని కిరణ్ చెప్పారు. తన కోడలు ట్విషా.. సెలూన్‌కు ఎప్పుడు వచ్చిందో, ఏ సమయంలో తిరిగి వెళ్లిందో స్పష్టంగా తెలపాలని గిరిబాలా సింగ్ కోరినట్టు షాప్ యాజమాని చెప్పారు. అలాగే ఆమె ఏ రకంగా డబ్బు చెల్లించారో.. ఆమె సెలూన్ సందర్శనకు సంబంధించి ఏదైనా ప్రూఫ్ లేదా రికార్డ్స్ కావాలని ఆమె పదే పదే అడిగారన్నారు. అయితే.. ట్విషా ఆ సమయంలో తనకు ఎలాంటి నగదు చెల్లించలేదని, గతంలోనే ప్రీపెయిడ్ ప్యాకేజీ తీసుకున్నారని పారిహార్ చెప్పారు. ఆ తర్వాత గిరిబాలా నుంచి మరోసారి ఫోన్ వచ్చిందని.. ట్విషా యోగక్షేమాల గురించి అడగ్గా.. ఆమె చనిపోయారని సమాధానమిచ్చినట్టు యజమాని చెప్పుకొచ్చారు. కాసేపటికే లాయర్ వస్త్రధారణతో కూడిన ఐదారు గురు వ్యక్తులు తన షాప్ వద్దకు వచ్చి.. తాము అడ్వొకేట్లమని పరిచయం చేసుకుని సీసీటీవీ ఫుటేజీ తీసుకెళ్లారని పేర్కొన్నారు. అయితే.. తాము న్యాయవాదులమని చెప్పుకున్న ఆ బృందంలోని సభ్యుల గుర్తింపులు తెలియరాలేదు. దీంతో ట్విషా శర్మ మృతికేసు ఇంకా మిస్టరీగానే ఉంది. పోస్ట్‌మార్టం నివేదిక, ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు ప్రకారం.. ట్విషాది ఆత్మహత్యేనని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో ఆమె కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు ట్విషా మృతదేహానికి రెండో సారి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ హైకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే.. పది రోజులుగా పరారీలో ఉన్న భర్త సమర్థ్ సింగ్‌ను ఎట్టకేలకు పోలీసులు మే 22న అరెస్ట్ చేశారు. అతణ్ని కోర్టులో హాజరుపరచనున్నారు.

# యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

- వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ







యాదగిరిగుట్ట,మే23 : యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం




- లారీని ఢీకొన్న క్రూజర్.. ఐదుగురు దుర్మరణం

బెంగళూరు,మే23 : కర్ణాటకలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లాడ్లాపూర్ సమీపంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వేగంగా వెళ్తున్న క్రూజర్ వాహనం ముందున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లాడ్లాపూర్ దగ్గర లారీని క్రూజర్ వాహనం ఢీకొట్టడంతో ఐదుగురు మృతిచెందారని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. మృతులను క్యాష్వార్, హుస్సేన్, అలీ, రసూల్, ఫాతిమాగా గుర్తించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని పోలీసులు వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్రూజర్ వాహనం పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కసారిగా కుటుంబంలోని ఐదుగురు మృతిచెందడంతో బంధువులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగం ప్రాణాంతకమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

- బయటకు రావాలంటే భయపడతున్న జనాలు



న్యూఢిల్లీ,మే23 : దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.

# ఉద్యోగాల పేరుతో లక్షల్లో వసూళ్లు

- టెక్నోరీచ్ సంస్థ సీఈఓ లక్ష్మీకాంత్‌పై కేసు




హైదరాబాద్,మే24 : టెక్నోరీచ్ సంస్థ సీఈఓ లక్ష్మీకాంత్ గౌడ్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఉద్యోగాల పేరుతో అభ్యర్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్టు లక్ష్మీకాంత్‌పై ఆరోపణలు వచ్చాయి. ట్రైనింగ్ పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. మార్చిలో 80 నుంచి 90 మంది ఉద్యోగులను సంస్థ నియమించు కుంది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా లక్ష్మీకాంత్ వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఆఫీస్ అ÷–దదె చెల్లించకపోవడంతో గత నెల 25న కార్యాలయానికి తాళం పడింది. జీతాల కోసం ప్రశ్నించిన ఉద్యోగిని సీఈఓ దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్లబ్బులు, పబ్బులకు రావాలంటూ మహిళా ఉద్యోగినిపై ఒత్తిడి చేసినట్టు ఫిర్యాదు వచ్చింది. పెండింగ్ జీతాలు ఇవ్వాలంటే ఒక్కొక్కరు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు లక్ష్మీకాంత్ గౌడ్‌పై బెదిరింపులు, వేధింపులు, మోసం తదితర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

# సెంట్రింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు


- వారి సమస్యలు పరిష్కరించాలన్న కవిత



హైదరాబాద్, మే 23: సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. శనివారం ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ గుత్తేదారుల అసోసియేషన్ మహాధర్నాకు కవిత మద్దతు ప్రకటించారు. ఈ ధర్నాకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జనసేన రాష్ట్ర నాయకులు ప్రేమ్ కుమార్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రెండు రోజుల్లో సెంట్రింగ్ కార్మికుల నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల తర్వాత తానే స్వయంగా ధర్నాలో కూర్చుంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లు గొంతెమ్మ కోరికలు కావని.. న్యాయమైనవేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కచ్చితంగా విద్య, వైద్యం అందిస్తామని కవిత స్పష్టం చేశారు.

# మాసాబ్ ట్యాంక్‌లో దారుణ ఘటన

- న్యాయవాదిని కారుతో ఢీకొటి చంపిన దుండుగుల
- కారు నంబర్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు



హైదరాబాద్,మే23 : హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో న్యాయవాది ఖాజా మొహియుద్దీన్‌పై ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన న్యాయవాదిని దుండగులు కారుతో బలంగా ఢీకొట్టారు. పక్కా ప్లాన్‌తో న్యాయవాది కోసం వేచి చూస్తున్న దుండగులు.. ఖాజా మొహియుద్దీన్ బయటకు వచ్చిన వెంటనే అత్యంత వేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యారు. కారు ఢీకొట్టిన వెంటనే న్యాయవాది గాల్లోకి ఎగిరి కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు.. మొహియుద్దీన్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.అయితే ఆయన అప్పటికే మృతి చెందారు. న్యాయవాదిపై హత్యాయత్నం దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. న్యాయవాదిపై దాడి సమాచారం తెలుసుకున్న తోటి న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాజా మొహియుద్దీన్‌ను కారుతో ఢీకొట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇది న్యాయవ్యవస్థపైనే దాడి అని వారు అభివర్ణించారు. ఈ ఘటనపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయవాదిపై దాడికి గల కారణాలు, ఆయనపై ఎవరు దాడి చేశారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇకపోతే మాసబ్ ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ కన్నుమూశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ న్యాయవాది తుదిశ్వాస విడిచారు. న్యాయవాది తన కారు వద్దకు వచ్చి వెనక సీట్లో బ్యాగు పెట్టి.. డ్రైవింగ్ సీట్‌లో కూర్చోబోతున్న సమయంలో ఒక్కసారిగా దుండగులు కారుతో అతివేగంగా దూసుకొచ్చి బలంగా ఢీకొట్టారు. క్షణాల్లోనే ఈ ఘటన చోటు చేసుకుంది. న్యాయవాదికి తీవ్రమైన గాయాలవడంతో వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే న్యాయవాది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చివరకు చికిత్స పొందుతూ మొయినుద్దీన్ ప్రాణాలు కోల్పోయారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. కారు నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# గ్రీన్ కార్డు జారీలో స్వల్ప సవరణలు

## భారతీయులకు ఊరటనిచ్చేలా ప్రకటన

వాషింగ్టన్,మే24 : అమెరికాలో నివసిస్తున్న తాత్కాలిక వలసదారులు శాశ్వత నివాసం పొందే హక్కు కోసం అగ్రరాజ్యం ప్రవేశపెట్టిన గ్రీన్ కార్డ్ నిబంధనల్ని సడలించింది. ఈ నిబంధనల్లో కొన్ని మినహాయింపులు ఇస్తున్నట్టు ప్రకటించింది. తాజా సడలింపులతో భారతీయులకు ఉపశమనం లభించింది. అగ్రరాజ్యంలో తాత్కాలిక వీసాలపై నివసిస్తున్న భారతీయులు ఆందోళనను రేకెత్తించిన అనంతరం.. యునైటెడ్ స్టేట్స్ ఇమ్మిగ్రేషన్ అధికారులు ఇటీవల ప్రకటించిన గ్రీన్ కార్డ్ నిబంధనలను పాక్షికంగా సడలించారు. సవరించిన విధానం ప్రకారం.. వర్క్, స్టూడెంట్, పర్యాటక వీసాలపై ఉన్న దరఖాస్తుదారులు తమ స్వదేశాలకు వెళ్లి, అమెరికా రాయబార కార్యాలయం లేదా కాన్సులేట్ ద్వారా గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే.. ఈ నిబంధనలు అందరికీ వర్తించవని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి జాక్ కహ్లర్ వెల్లడించారు. అమెరికా జాతీయ, ఆర్థిక ప్రయోజనాలే ప్రధానమనుకున్న వలసదారులకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుంది. గ్రీన్ కార్డ్ ఆశావహులు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా.. మా దేశానికి ప్రయోజనముందని భావిస్తే వాటిని పరిగణనలోకి తీసుకుంటాం. అలాంటప్పుడు వారు ప్రస్తుత నిబంధనల ప్రకారం కొనసాగేందుకు అనుమతిస్తాం. మిగిలినవారిని వారి స్వదేశానికి వెళ్లి దరఖాస్తు చేసుకోమని సూచిస్తాం' అని కహ్లర్ తెలిపారు. అయితే.. ఆ దరఖాస్తులు తమ దేశానికి ఏరకంగా ప్రయోజనం చేకూరుస్తాయి, వాటిని ఎలా నిర్ణయిస్తారనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. కొత్త నిబంధనల్లోని లోపాలను ఉపయోగించుకుంటూ ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశాలు తగ్గిపోతాయని ఆయన స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో పూర్తి నిర్లక్ష్యం

## రైతుల అగచాట్లు పట్టని ప్రభుత్వం: వేముల



నిజామాబాద్,మే23 : పంట కొనుగోలులో దారుణంగా విఫలమైన ప్రభుత్వం అన్నదాతల ఆత్మహత్యలపై తప్పుడు లెక్కలు చెప్తున్నదని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి మండిపడ్డారు. ధాన్యం ఎక్కడా సక్రమంగా కొనగడం లేదన్నారు. నిజామాబాద్‌కు వస్తే రైతులు పడుతున్న అగచాట్లను చూపిస్తానని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు పది మందిపైనే ఉన్నారని, కానీ ఒక్కరూ చనిపోలేదని మంత్రి అనడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. 'పంటలు కొనక పోవడంతో గగ్గోలు పెడుతూ రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులు ప్రాణాలు కోల్పోయినా నిస్సిగ్గుగా అబద్దాలు చెప్తున్నారని విరుచుకుపడ్డారు. అవసరమైతే ప్రభుత్వానికి రైతుల మరణాల వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మండుటెండల్లో రైతులు పంటలు అమ్ము కొనేందుకు పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాల్లోవివరాలు సేకరించాకనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నానని స్పష్టంచేశారు. పంట కొనుగోలు సంక్షోభం, అన్నదాతలు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలన్నారు. పంట కొనుగోలు సంక్షోభంపై చర్చించాలని, చర్యలకు ఆదేశించాలని అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై రైతుల ధర్నా

- శాంతియుత ధర్నా చేస్తున్నా అరెస్ట్ చేస్తే ఎలా
- ప్రభుత్వంపై మండిపడ్డ గజ్వేల్ బిఆర్ఎస్ నేత వంటేరు

మెదక్,మే23 : రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తున్నారని గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఆరోపించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. వారికి మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నిరసన తెలిపే హక్కు లేదా అని ప్రశ్నించారు. పోలీసులు దౌర్జన్యంగా రైతులను అరెస్టు చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు గన్నీ బస్తాలు, లారీలు లేకపోవడంతో వడ్లు కల్లాల్లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు దౌర్జన్యంగా ధర్నా చేయకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు..

- ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు
- హరీష్ వ్యాఖ్యలపై పొంగులేటి కౌంటర్



హైదరాబాద్, మే 23: బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. లాగే మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారని ్గ÷ర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు.

# (మొదటిపేజీ తరువాయి)

## గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ.300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## రైతులకు ఆధునిక టెక్నాలజీలను అందించాలి

పంటలనే సాగు చేయాలని, పంట మార్పిడి విధానాలని అనుసరించాలన్నారు. 60 ఏళ్ల క్రితం ఏర్పాటు అయిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సహా అనేక మంది మహానుభావుల తోడ్పాటు తో దేశం లో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిందని మంత్రివర్యులు అభిప్రాయపడ్డారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి తోడ్పాటు తో విశ్వవిద్యాలయం ఇంకా పురోగతి సాధిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు నిరంతరం రైతుల తో మమేకం అయి వారికి కావలసిన పరిష్కారాలు అందించా లన్నారు. అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న అనేక అదునాతన టెక్నాలజీ లని విశ్వవిద్యాలయం రైతాంగానికి అందుబాటులోకి తీసుకొని రావాలని మంత్రి విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకి సూచించారు. సాగుకు కీలకం అయిన నాణ్యమైన విత్తనాలని రైతాంగానికి అందించాలనే ఉద్దేశం తో గత ఏడాది నుంచి ఈ విత్తన పంపిణి కార్యక్రమం చేపట్టామని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. కార్యక్రమం లో పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠి బలరామ్,డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటేశ్వర్లు,డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ వై.చంద్రమోహన్ శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు

చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలోనే ఈ వార్త జనానికి తెలుస్తుంది. పెంచిన ధరలు ఈ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయని ప్రకటిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపు అనేది టీవీల్లో, సోషల్ మీడియాలో చూసి మాత్రమే జనం తెలుసుకుంటున్నారు.

## భద్రత, వాణిజ్య,సాంకేతిక రంగాల్లో సహకారం

దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

## అవగాహన లేకుండా పొంగులేటి ఆరోపణలు

- రియల్ మాఫియా చేతుల్లో మంత్రి
- ఫ్యూచర్ సిటీ అక్రమాలకు అడ్డా అన్న దాసోజు



**హైదరాబాద్, మే 23:** బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన అహంకారపూరిత, అవహేళన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర గానీ, ఇక్కడి ప్రగతి ప్రస్థానం గానీ తెలియని పొంగులేటి.. ఒక బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి నిస్సిగ్గుగా, చిల్లర జ్యోతిష్యాలు చెప్పడం హాస్యాస్పదమని మండిపడ్డారు. మా పొలిటికల్ ఫ్యూచర్ గురించి మాట్లాడే నైతిక అర్హత నీకెక్కడిది పొంగులేటి అని మండిపడ్డారు. సలు నీ ఫ్యూచర్ ఏంటో నీకు తెలుసా.. త్వరలోనే మీ అవినీతి లీలలన్నీ బట్టబయలై, జైలు ఊచలు లెక్కబెట్టడమే నీ ఫ్యూచర్ అని వ్యాఖ్యానించారు. మీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన తాత్కాలిక అవినీతి సామ్రాజ్యాన్ని బద్దలు కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు. నువ్వు చేస్తున్న అక్రమాలు, వెనుక ఉండి నడిపిస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియా దందాలకు.. నీ ఫ్యూచర్ మరో రెండేళ్లు దాటితే చర్లపల్లి జైల్లోనే ఉంటుంది. రాసి పెట్టుకో అని హెచ్చరించారు. పదేళ్లలో ఒక్క మెట్రో స్టేషన్ కూడా కట్టలేదని బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడానికి సిగ్గుండాలని అన్నారు. అసలు కళ్ళు ఉండి చూస్తున్నావా, లేక అధికార అహంకారంతో కళ్ళు పూర్తిగా మూసుకుపోయాయా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయి మెట్రో ప్రాజెక్టును తెచ్చి, రికార్డు సమయంలో ఫేజ్-1 పూర్తి చేసి చూపించింది నాటి కేసీఆర్ ప్రభుత్వం అని గుర్తుచేశారు. హైటెక్ సిటీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో ఫేజ్-2 కి సంబంధించిన అన్ని ప్రణాళికలు, రూట్ మ్యాప్‌లను సిద్ధం చేస్తే.. ఈరోజు అధికారంలోకి వచ్చిన మీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రద్దుచేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ కాదు.. అది 'ఫేక్' సిటీ.. ల్యాండ్ మాఫియా అడ్డా అని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ప్రపంచ దేశాలు మెచ్చేలా, ఉపాధి కల్పనే ధ్యేయంగా నాడు కేసీఆర్ తెచ్చిన గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సిటీని రద్దు చేసి.. ఈరోజు 'ఫ్యూచర్ సిటీ' అనే రంగుల ప్రపంచం పేరుతో మీరు చేస్తోంది ఏంటని ప్రశ్నించారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం పేద ప్రజల, గిరిజనుల, రైతుల నోళ్లు కొట్టి వారి భూములను అక్రమంగా లాక్కోవడమే మీ ఫ్యూచర్ సిటీ వ్యూహమా? అని నిలదీశారు. ఫ్యూచర్ సిటీ ముసుగులో వేల కోట్ల రూపాయల అవినీతికి, ల్యాండ్ పూలింగ్ స్కామ్‌లకు తెరలేపారని అన్నారు. నాదర్‌గుల్, లగచర్లలో రైతులను బెదిరించి, వారిపై దాడులు చేసి అక్రమ కేసులు బనాయించి, వారిని వేధిస్తున్న మీ నిరంకుశత్వంపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని అన్నారు. మీ భూ కబ్జాలు, మీ ఊఎఒ‌ుఖ పాలసీ పేరుమీద ఇండస్ట్రియల్ మాఫియా దందా లన్నీ త్వరలోనే ఆధారాలతో సహా బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. మీ అక్రమ పాలనకు, దగాకోరు రాజకీయాలకు ఇంకో రెండేళ్లు మాత్రమే గడువు ఉందని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. ఎంత ఎంజాయ్ చేస్తావో చేసుకో, ఎంత దోస్తావో దోచుకో పొంగులేటి.. ఆ తర్వాత ప్రజల పక్షాన ప్రతి పైసా లెక్క తేలుస్తాం.. మీనుండి కక్కిస్తామని అన్నారు. మిమ్మల్ని చర్లపల్లి జైలు ఊచలు లెక్కపెట్టించడం ఖాయమని వ్యాఖ్యానించారు.

## గురుకులాల కిరాణ కొనుగోళ్లలో అవినీతి

### రేవంత్ రెడ్డికి దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, మే 23:** గురుకులాల కిరాణ కొనుగోళ్లలో అవినీతి జరుగుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ల వ్యవస్థను పక్కనబెట్టడం తీవ్ర అవమానకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఐఏఎస్ అధికారులపై ప్రభుత్వానికి నమ్మకం లేదా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ రాశారు. రూ.100 కోట్ల కమిషన్ల కోమే మూడు నెలల టెండర్ల విధానానికి మంగళం పాడారని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఏడాది కాలపరిమితి టెండర్లతో ప్రభుత్వ ఖజానాకు వందల కోట్లు గండి కొట్టే ఎ÷-లాన్ చేశారని మండిపడ్డారు. తెలంగాణ బ్రాండ్ తాండూర్ కందిపప్పునకు మంగళం పాడి.. ఆఫ్రికా నాసిరకం పప్పులతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.165 కోట్ల టర్నోవర్ నిబంధనతో స్థానిక చిన్న వ్యాపారులు, మహిళా సంఘాల గొంతు నొక్కడమే అని వ్యాఖ్యానించారు. కేంద్రీకరణ మేలైతే ప్రైవేటు కాంట్రాక్టర్లు ఎందుకు అని ప్రశ్నించారు. మార్క్‌ఫెడ్ ద్వారా నేరుగానే కొనుగోలు చేయవచ్చు కదా అని నిలదీశారు. అధికారులకు రాబోయే కేసీఆర్ ప్రభుత్వంలో న్యాయ విచారణ తప్పదని హెచ్చరించారు.

## ఫ్యూచర్ సిటీని అడ్డుకోవడం ..అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే :ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

**హైదరాబాద్, మే 23:** హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. రెండున్నరేళ్లలో ఇండ్లు కూల్చడమే కానీ.. అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకోవడం అంటే మీ అక్రమార్క ప్రణాళికను అడ్డుకోవడమే అని అన్నారు. ఫార్మాసిటీని కొనసాగిస్తామని కోర్టుకు ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. ఫార్మా సిటీ కోసం మాత్రమే రైతులు భూములు ఇచ్చారని దేశపతి శ్రీనివాస్ తెలిపారు. మీ భూదందాల కోసం రైతులు భూములు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఫార్మాసిటీని రద్దు చేసిన భూములు తిరిగి ఇచ్చేస్తామని గతంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పలేదా అని ప్రశ్నించారు. మీ స్వార్థ ప్రయోజనాల కోసం ఫార్మాసిటీ భూముల్ని మళ్లిస్తారా అని మండిపడ్డారు. మీ విధ్వంసాన్ని చక్కదిద్దే బాధ్యత మాపై ఉందని వ్యాఖ్యానించారు.

# వైఎస్ కుటుంబానిది రక్త చరిత్ర

- ఫ్యాక్షన్ రాజకీయాలు వారితోనే మొదలు
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి,మే23 :** ఫ్యాక్షన్ రాజకీయాలకు బీజం వేసింది వైఎస్ కుటుంబం అయితే... జగన్ దాన్ని కొనసాగిస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఈ మేరకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి పయ్యావులతీవ్రంగా విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పులివెందులలో వైఎస్ రాజారెడ్డి అకృత్యాలను వివరించారు. జగన్ అరాచక రాజకీయాలపై యువత ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జగన్ బాధితుడు కాదని.. నిందితుడంటూ వ్యాఖ్యానించారు. జగన్ బెంగళూరు నుంచి వచ్చినప్పుడల్లా కొత్త వాదన తెస్తారన్నారు. వివేకా హత్య కేసులో ఏం జరిగిందో నిక్కరు వేసుకున్న కుర్రాడు కూడా చెబుతాడని.. అలాంటి వాటిల్లో కూడా జగన్ అసత్యాలు చెబుతున్నారని అంటూ దుయ్యబట్టారు. వైఎస్ కుటుంబంతోనే రాజకీయాలు నేరమయ్యాయని.. రాజకీయాల్లోకి ఫ్యాక్షన్ తెచ్చారని మంత్రి మండిపడ్డారు. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీమలో ఫ్యాక్షనిజానికి అండగా నిలిచిందని ఆరోపించారు. నాటి ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలో పార్నపల్లి అనే గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చిందని.. ఆ గ్రామానికి చెందిన టీడీపీ నేతల ఇళ్లకు డ్రిల్ చేసి డైనమేట్లు పెట్టి పేల్చారని.. ఇదీ రాజారెడ్డి చరిత్ర అని చెప్పుకొచ్చారు. ఓ ఇంటిని డైనమేట్లు పెట్టి పేల్చేసిన ఘటనను ఇప్పటికీ ఎవ్వరూ మరిచిపోలేదన్నారు. తన ప్రత్యర్థుల మీద దాడి చేయించి... అదే సందర్భంలో వేరే చోట ఉన్నట్టు సృష్టించుకోవడం అనేది వైఎస్ కుటుంబంతోనే మొదలైందని అన్నారు.కడప జిల్లాలోని లింగాల మండలంలో ముగ్గురు టాప్ లీడర్లను భయపెట్టి లొంగదీసుకున్నారని పయ్యావుల ఆరోపించారు. ఇలాంటివి పదుల సంఖ్యలో పులివెందులలో జరిగాయన్నారు. రాజారెడ్డి నుంచి మొదలుకుని పులివెందులలో జరిగిన ఘటనలపై పుస్తకం వేస్తామన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక సీమలో ఫ్యాక్షన్ కంట్రోల్లోకి వచ్చిందన్నారు. వైఎస్ కుటుంబం మొదలు పెట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను కంట్రోల్ చేయడానికి 30 ఏళ్లు పట్టిందని తెలిపారు. రప్పా రప్పా అంటే వారితో ఫొటోలు దిగుతారని.. సొంత పార్టీ కార్యకర్త కారు కింద నలిగిపోయినా పట్టించుకోరని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ గొడ్డలి అంటే జగన్ మోహన్ రెడ్డి ఉలికిపాటుకు గురవుతున్నారన్నారు. గొడ్డలిపోటును గుండెపోటుగా చూపించగలరని దుయ్యబట్టారు. 'నిజాలను ప్రజలకు చెప్పాలి... అవగాహన కల్పించాలి. అందుకే గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం... గొడ్డలి పార్టీ నెవ్వర్ ఎగైన్' అని స్పష్టం చేశారు. ఓ తరానికి ఉపాధి కల్పించేలా చంద్రబాబు అవకాశాలు సృష్టించారని పయ్యావుల కేశవ్ తెలిపారు.

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

- వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు
- మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పన పరిహారం
- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటీ సమీక్ష



**హైదరాబాద్,మే23 :** రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో 7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోద య్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకో వాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

## పజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత

- ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
- ఆరోగ్యమే మనకు అసలు సిసిలు సంపద
- యోగా, ధ్యానం, ప్రాణాయామం జీవితంలో భాగం కావాలి
- ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని
- కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు



**చిత్తూరు,మే24 :** ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. శనివారం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సిఎం వివరించారు. 'రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. సంజీవని పథకం విస్తరణలో భాగంగా డబ్బు, హోదా, కార్లు ఎన్ని ఉన్నా.. అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని గుర్తుచేశారు. సంజీవని పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశముందన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

## ఎపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

- రాహుల్ ప్రధాని అయితేనే ఎపికి లబ్ది
- రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలో బిజెపి
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్,మే24 :** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం చేయలేరని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల కల్యాణం చేస్తాను. తెలంగాణలో ఒక్క బీజేపీ నేత అయినా నాలాగా చేస్తారా?. రాములవారి కల్యాణం చేసి నేనెప్పుడైనా ఓట్లు అడిగానా?. ఛత్రపతి శివాజీకి లేని మతం మీకెందుకు?. శివాజీ దగ్గర ముస్లింలు మంత్రులుగా పనిచేశారు. బీజేపీ నేతలు చదువుకోవాలి. ఆ పార్టీ వాళ్లు మాట్లాడితే హిందువులు అంటారు. రాజ్యాంగాన్ని తీసేసే కుట్ర బీజేపీ చేస్తోంది. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పాటుపడు తున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దేశ ప్రజలకు కవచం లాంటిది రాజ్యాంగం. కవచ కుండలాలు ఉన్నంతకాలం కర్ణుడిని ఎవరూ చంపలేకపోయారు. అవి దానం చేశాక కర్ణుడి ప్రాణాలు పోయాయి. ఎన్నికల కమిషన్ ద్వారా ఓటు చోరీ చేసి కమలం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఓట్లను దొంగిలించి ఎంపీ సీట్లు గెలిచింది. దేవుడి పేరుతో, మతం పేరుతో, దొంగ ఓట్లతో ఆ పార్టీ గెలుస్తోంది. దేశ ప్రజలు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారు. రాజ్యాంగాన్ని తీసేస్తే మరింత ప్రమాదంలో పడతారు. దేశం 67 ఏళ్ల పాలనలో రూ.54 లక్షల కోట్ల అప్పు చేస్తే.. బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1,047 లక్షల కోట్ల అప్పులు చేసింది. రాహుల్ కుటుంబం అధికారం కోసం ఏనాడూ తాపత్రయపడలేదు. ఆయనది ఆస్తులు, ప్రాణత్యాగం చేసిన కుటుంబం. ప్రధాని పదవిని రాహుల్ త్యాగం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత మోదీ చేసిన మంచి ఒక్కటి చెప్పండి' అని మండిపడ్డారు.

## మర్యాద, సంస్కారాలు భారత్ నుంచి నేర్చుకోండి

### అమెరికా విదేవాంగ మంత్రికి

### ఇరాన్ కాన్సులేట్ సూచన

**ముంబై,మే24 :** అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఇరాన్ వ్యంగ్యంగా స్పందించింది. ఇరాన్ ముంబై కాన్సులేట్ సోషల్ మీడియా వేదికగా రుబియోను ఉద్దేశిస్తూ 'భారతీయుల నుంచి కొంచెమైనా మర్యాద, సంస్కారం నేర్చుకోండి' అంటూ ఎక్స్ ఖాతాలో వ్యంగ్యంగా ఓ పోస్ట్ చేసింది. అమెరికా-భారత్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు మార్కో రుబియో ప్రస్తుతం పర్యటనకు వచ్చారు. యుద్ధం ముగింపు చర్చలు జరుగుతుతన్న ప్రస్తుత తరుణంలో అమెరికాకు చెందిన కొందరు నేతల డిమాండ్లు, ప్రవర్తనపై ఇరాన్ తీవ్ర ఆగ్రహంగా ఉంది. ఇరాన్ తమ డిమాండ్లకు తలొగ్గకుంటే మరోసారి సైనిక చర్యకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. అమెరికా ఉపాధ్యక్షుడు, రక్షణ మంత్రి కూడా ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ అమెరికా విదేశంగా మంత్రికి చురక అంటించింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భారత్ పర్యటన తొలి రోజే ప్రధాని నరేంద్ర మోదీతో న్యూఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ భేటీలో కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. అంతకు ముందు రుబియో కోల్‌కతాకు చేరుకుని మథర్ థెరిసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ప్రధాన కేంద్రాన్ని సందర్శించారు.

## జింఖానా క్లబ్‌ను స్వాధీనానికి నోటీసులు

**న్యూఢిల్లీ,మే24 :** దేశంలోనే అతి పురాతన క్లబ్‌లలో ఒకటైన లూటియన్స్ ఢిల్లీలోని జింఖానా క్లబ్‌ను ప్రాంగణాన్ని జూన్ 5 లోగా సర్కార్ కు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. రక్షణ మౌలిక సదుపాయాలు బలోపేతం చేసేందుకు, ప్రజా భద్రతాప్రయోజనాల కోసం ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్న 27.3 ఎకరాల స్థలాన్ని రక్షణ శాఖకు అప్పగించాలని ఆదేశించింది.ఢిల్లీలోని సప్దర్‌జంగ్ రోడ్‌లో ఉన్న ప్రాంగణాన్ని గతంలో సామాజిక ,క్రీడా క్లబ్‌ను నిర్వహించే నిర్దిష్ట ప్రయోజనం కోసం ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చినట్లు మే 22న జారీ చేసిన అధికారిక ఉత్తర్వులో పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం.. జూన్ 5న ఆ ప్రాంగణాన్ని భూమి ,కార్యాలయ భవనాన్ని స్వాధీనం చేసుకోనుంది.



# హరీష్ రావువి పగటి కలలు

- అధికారంలోకి రావడం కల్ల
- ఫ్యూచటర్ సిటీపై బాధ్యాతారాహిత్య ప్రకటన
- అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బిఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మే23:** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు. దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళ్తున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడి దారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు.రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు.బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

# యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

- దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు
- ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మే23:** దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ౦ఎ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం-శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యు

# బక్రీద్ సెలవు 28కి మార్పు

## ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,మే24 :** తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్ (ఈద్ అల్-అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో మాత్రం ఈ నెల 27న(బుధవారం) ఈ పండుగను జరుపుకోనున్నారు. తొలుత ప్రకటించిన దాని ప్రకారం.. మే 27న ఉండగా, దానిని మే 28 గురువారం నాటికి మారుస్తూ ఇరు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీచేశాయి. వాస్తవానికి ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ బక్రీద్.. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్-హిజ్జా 10వ రోజు వస్తుంది. ఆ ప్రకారం ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. అయితే.. ఈసారి దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒకరోజు ఆలస్యం కావడంతో పండుగ తేదీ మారినట్టు మతపెద్దలు ప్రకటించారు.తెలంగాణ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం పండుగ సెలవును 28కి మార్చింది. మే 28న సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు.. మే 28న సెలవు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీచేసింది.

# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

- చిన్నారుల అంతర్థానంపై సుప్రీంకోర్టు ఆందోళన
- కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి
- అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం



**న్యూఢిల్లీ,మే24 :** దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ౦ఊఃఉజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబ సభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు చూసుకోవాలి. రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసుకోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది.2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణేశిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011 లో మిస్ అయింది కావున, 2013 లో వచ్చిన హోం శాఖ యాంటీ-ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది.ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ-ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

# గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

- రప్పారప్పా అంటే తోక కట్ చేస్తాం
- వైసిపికి సిఎం చంద్రబాబు హెచ్చరిక




**చిత్తూరు,మే24 :** 'సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా యాదమర్రిలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎం మాట్లాడారు. రప్పారప్పా రంకెలు.. జంతు రక్తంతో కటౌట్లకు అభిషేకాలా..సీబీఎన్ దగ్గర తోక జాడిస్తే.. ప్రజాహితం కోసం తోక కట్ చేస్తానని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, ప్రజాస్వామ్యంలో ఆ పార్టీకి చోటులేదని సీఎం అన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఇవ్వాలి. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకొక నాటకమాడుతున్నారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? దళిత యువకుడు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి సన్మానాలా? కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు.. తల్లి, చెల్లికి ఆస్తులివ్వకుండా వేధించారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు.. ప్రజలను ఏం చూస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు. నేను ప్రజల సేవకుణ్ణి.. పెత్తందారు కాదు. నిరంతరం పనిచేసి పేదల రుణం తీర్చుకుంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించింది. ఎన్డీయే కూటమి అని సీఎం అన్నారు. జగన్ నంగనాచిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని విమర్శిం చారు. మాజీ మంత్రి వివేకా హత్యకేసులో తనపై దుష్ప్రచారం చేశారని ఆగ్రహించారు. బాబాయ్ హత్యలో తనపై నారాసుర రక్త చరిత్ర అని ప్రచారం చేశారని దుయ్యబట్టారు. డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను చంపిన ఎమ్మెల్సీ అనంత బాబుకు.. జగన్ సన్మానం చేశారని సెటైర్లు గుప్పిం చారు. తల్లి, చెల్లిని చూడనివారు ప్రజలకు మంచి చేస్తారా..? అని ప్రశ్నించారు. ఏపీ అభివృద్ధిని చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపో తోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. అమరావతిపై గొడ్డలి వేటు వేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అని విమర్శించారు. అసత్య ప్రచారాలతో జగన్ అండ్ కో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? అని ప్రశ్నించారు. కులమతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకో నాటక మాడుతున్నారని విమర్శించారు. జగన్ అధికార దాహానికి తల్లి, చెల్లి అతీతం కాదని అన్నారు. హిందూ ధర్మం, దేవాలయాలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు పాస్టర్లతో డ్రామాలు చేయిస్తున్నారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. రప్పా.. రప్పా అని జగన్ కటౌట్లకు జంతువుల రక్తం చల్లుతున్నారని విమర్శిం చారు. తన దగ్గర తోకజాడిస్తే కట్ చేస్తా.. ఇక్కడుంది 1995 నాటి సిబిఎన్ అని ప్రస్తావి ంచారు.జగన్.. ముందు నీఇంట్లో సమస్య లు చూసుకోవాలని హితవు పలికా రు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా..గొడ్డలి పార్టీ బుద్ధిమారట్లేదని ఆగ్రహిం చారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీకి చోటు లేదని చెప్పుకొచ్చారు. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని.. గొడ్డలిపార్టీ నెవర్ అగైన్ అని పేర్కొన్నారు.

# బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

## వివాదాస్పద ఫుట్‌బాల్ శిల్పం కూల్చివేత

**కోల్‌కతా,మే24 :** కోల్‌కతాలోని ప్రఖ్యాత సాల్ట్ లేక్ స్టేడియం వీవీఐపీ గేటు వెలుపలనున్న వివాదాస్పద ఫుట్‌బాల్ శిల్పాన్ని శనివారం ఉదయం కూల్చివేశారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫుట్‌బాల్ శిల్పం కూల్చివేత జరిగినట్టు అధికారులు తెలిపారు. సాల్ట్ లేక్‌లోని వివేకానంద యుబ భారతి క్రీరాంగణ్ గా పేరున్న ఈ స్టేడియం పునరుద్ధరణ కార్యక్రమం 2017లో జరిగింది. ఆ సమయంలో ఫుట్‌బాల్ శిల్పాన్ని ఏర్పాటు చేశారు. నాటి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పర్యవేక్షణలో ఈ శిల్పం ఏర్పాటైంది. నడుము వరకూ ఉన్న కాళ్లు, దానిపై ఫుట్‌బాల్, బిశ్వబంగ్లా లోగోతో ఈ శిల్పం నిర్మించారు. అయితే ఈ నిర్మాణం కళాత్మకంగా లేదని, అసహ్యకరమైన ఆకృతిలో అర్ధరహితంగా ఉందనే విమర్శలు రావడంతో దానిని తెలగించాలనే నిర్ణయం తీసుకున్నట్టు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి నితీష్ ప్రమాణిక్ ఇటీవల ప్రకటించారు. ఆయన మే 17న స్టేడియంలో జరిగిన 'మోహన్ బగాన్ ఈస్ట్ బెంగాల్ డెర్బీ'కి హాజరయ్యారు. మ్యాచ్ అనంతరం ఫుట్‌బాల్ శిల్పం రూపకల్పనపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆ శిల్పం పెట్టినప్పటి నుంచి గత పాలకుల పరిస్థితి తిరగబడిందని చాలామంది అభిప్రాయపడినట్టు చెప్పారు.కాగా,



ప్రజాపనుల శాఖ సీనియర్ అధికారులతో సంప్రదింపుల తర్వాతే ఫుట్‌బాల్ శిల్పాన్ని తొలగించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నట్టు క్రీడాశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు సాల్ట్ లేక్ స్టేడియంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. సౌందర్యం, సాంస్కృతిక ప్రాధాన్యలు మేళవించి ఫుట్‌బాల్ క్రీడకు చెందిన ల్యాండ్‌మార్క్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని చెప్పారు. పాత శిల్పం స్థానే ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుని విగ్రహం ఏర్పాటు చేసేందుకు చర్చలు జరుగుతున్నాయని అన్నారు. పశ్చిమబెంగాల్ ఫుట్‌బాల్ వార సత్వం, యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచే సింబల్‌ను తామంతా కోరుకుంటున్నామని చెప్పారు.

# కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటున్న పోలీసులు

## రాష్ట్రంలో శాంతిభద్రతలు నశించాయయి
## మధు అంత్యక్రియల్లో పాల్గొన్న జగదీశ్ రెడ్డి

**సూర్యాపేట,మే24 :** పోలీసులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని తిరుగుతున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అడ్డాగా మారాయని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్త మధు అంత్యక్రియల్లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకాలు పెరిగిపోయాయని జగదీశ్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు నశించాయని అన్నారు. ఇప్పటివరకు తమ జిల్లాలో ఇద్దరు కార్యకర్తలను పొట్టన బెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు శిక్షలు పడేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. 2018లో జరిగిన బీఆర్ఎస్




నాయకుడి హత్య కేసులో కీలక సాక్షిగా ఉన్న మధును కాంగ్రెస్ నాయకులు అనేకసార్లు బెదిరించారని తెలిపారు. ఓ పోలీసు అధికారి స్వయంగా పిలిచి నువ్వు ఎగిరిపోతావని బెదిరించాడని పేర్కొన్నారు. ఈ హత్య పోలీసు అధికారులకు తెలిసే జరిగిందని అన్నారు. అందుకే మధును ముందే పోలీసు అధికారి హెచ్చరించారని చెప్పారు. పోలీసోళ్లు బెదిరిస్తున్నారని చెబితే జాగ్రత్తగా ఉండమని చెప్పానని.. కానీ ఏదో పంచాయతీ ఉందని పిలిచి మధును హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మా కార్యకర్తను హత్య చేసిన నిందితులను ఇప్పటివరకు అరెస్టు చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ గూండాల చేతిలో దారుణమైన హత్యకు గురైన మా కార్యకర్త మధు కుటుంబ పోషణ బాధ్యత, పిల్లల చదువుల బాధ్యత బీఆర్ఎస్ పార్టీనే తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కేసులో ఏ అధికారి తప్పు చేసినా మేము గమనిస్తూనే ఉంటామని తెలిపారు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆ అధికారి తప్పించుకోలేదని హెచ్చరించారు. ఇలాంటి క్రిమినల్ కేసులు పదేండ్ల తర్వాత కూడా ఓపెన్ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు. తప్పు చేస్తే ఐజీ, డీజీ స్థాయి అధికారులను కూడా వదిలేది లేదని స్పష్టం చేశారు. అది దృష్టిలో పెట్టుకొని పోలీస్ అధికారులు విచారణ చేయాలని సూచించారు.

# నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం..

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**- రాజన్న సిరిసిల్లలో మెగా జాబ్ మేళా**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని,యువతకు ఉపాధి కల్పించడమే మా ప్రథమ ప్రాధాన్యత అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ వేదికగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను అధికారికంగా ప్రారంభించారు. నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ మేళాకు సుమారు 30 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పట్టణంలో గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం 99 రోజుల ప్రణాళికను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేస్తున్నమని అన్నారు . నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నది అని , ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 70 వేల ఉద్యోగాలను కల్పించామని అన్నారు . కేవలం ప్రభుత్వ రంగంలోనే కాకుండా, ప్రైవేట్ రంగంలోనూ పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించాలనే సంకల్పంతోనే ప్రభుత్వం ఈ ఉద్యోగ మేళాలను నిర్వహిస్తోందని అన్నారు .

రాష్ట్రంలో త్వరలోనే గ్రూప్-1, టీచర్ పోస్టుల భర్తీ వంటి అనేక ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియలను చేపట్టబోతున్నామని అన్నారు . ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలనుకునే యువతీ యువకులకు ప్రభుత్వం తరపున సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నామని, కొత్తగా పరిశ్రమలు స్థాపించాలనుకునే వారికి ప్రభుత్వం అన్ని వేళలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేశామని అన్నారు . నిరుద్యోగ యువతీ యువకులు ఈ మెగా జాబ్ మేళా ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# సమన్వయంతో మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 25 నుండి 30 వరకు మహిళా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, సమన్వయంతో ఈ మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 25 నుండి 30 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలపై మహిళా, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, మెప్మా శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మహిళా వారోత్సవాల సందర్భంగా రోజూ వారీగా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.మే 25 వ తేదీన పోషకాహార మిషన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేసి, సే నో టూ జంక్ ఫుడ్ పై అవగాహన, వంటల పోటీలతో పాటు గర్భిణీ స్త్రీలకు రక్తహీనత పరీక్షలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డులలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు.మే 26 వ తేదీన బాల్య వివాహాల నిర్మూలన తెలంగాణ లక్ష్యంగా బాల్య వివాహం -- బతుకు ఆగం పేరుతో బాల్య వివాహాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పోస్టర్లు, పాంప్లెట్లు, గోడలపై చిత్రలేఖనం, తదితర ప్రచార కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు .బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే గ్రామాలను గుర్తించి, మత పెద్దలు, కల్యాణ మండపాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి,1098, 181 సేవలపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు.అలాగే నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి పాస్ బుక్ లు అందజేసి, సన్మానం చేయాలని ఆదేశించారు.

మే 27 వ తేదీన మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు,మహిళా సంఘాల సభ్యులకు లోన్ మేళా నిర్వహించాలని అన్నారు.మే 29 వ తేదీన జిల్లాలో నూతన అంగన్వాడీ కేంద్రాలు, వీఓ భవనాలు, మెప్మా ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో క్యాంటీన్ ప్రారంభించాలని సూచించారు.

ఈ నెల 30వ తారీఖున అమ్మ మాట అంగన్వాడి బాట పేరుతో అంగన్వాడి బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు . ఈ సందర్భంగా ఐదు సంవత్సరాల నిండిన పిల్లలకు ప్రాథమిక పాఠశాలకు పంపించడానికి విద్యారంభ్ సర్టిఫికెట్లు అందజేయాలని అలాగే సూచించారు. అలాగే కొత్తగా అంగన్వాడీ కేంద్రాలకు కొత్త పిల్లల్ని చేర్చుకోవడం, పిల్లల సంఖ్యను పెంచడానికి చర్యలు చేపట్టాలని సూచించారు.అలాగే జిల్లా స్థాయిలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్ పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. దొంగల ముఠా అరెస్ట్..



**-జల్సాలకు బానిసై దొంగలుగా మారిన యువకులు..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లాలో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాతో పాటు, చోరీ సొత్తును కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినామని డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. శనివారం సిరిసిల్ల డీఎస్పీ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ అరెస్ట్ అయిన వారి

వద్ద నుంచి 17.5 గ్రాముల బంగారం, 14.5 తులాల వెండి, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, రెండు సెల్ఫోన్లు, రూ.1500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.సిరిసిల్లకు చెందిన పాత నేరస్థుడు ఆడెపు రవి జల్సాలకు అలవాటు పడి తన స్నేహితులైన సామల్ల బాలకిషన్, బోదాసు గోపి, వేముల సాయిచరణ్ రెడ్డి, గాజులవేణి అరుణ్ కుమార్, మూల అభిలాష్‌లతో ముఠాగా ఏర్పడ్డాడ అని అన్నారు . పగలు రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడే ఈ ముఠా ఏప్రిల్ 26 నుంచి మే 21 వరకు సిరిసిల్ల పరిధిలో ఐదు ఇళ్లలో దొంగతనాలు చేశారని అన్నారు.మే 23న మరో భారీ చోరీ కోసం ఆటోలో సిరిసిల్లకు వస్తుండగా పక్కా సమాచారంతో ఎల్లమ్మ సర్కిల్ వద్ద పోలీసులు వీరిని పట్టుకున్నారని అన్నారు . విచారణలో దొంగిలించిన ఆభరణాలను ముస్తాబాద్‌కు చెందిన కస్తూరి సాయితేజకు, వేములవాడకు చెందిన శీలం సంతోష్ రెడ్డికి విక్రయించినట్లు నిందితులు అంగీకరించారని,దీంతో చోరీ సొత్తు కొనుగోలు చేసిన ఆ ఇద్దరినీ కూడా అదుపులోకి తీసుకుని, మొత్తం ఎనిమిది మందిని రిమాండ్‌కు తరలించామని అన్నారు . నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్, ఇతర పోలీస్ సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# గార్మెంట్ కార్మికులకు పెంచిన వేతనాలు తక్షణమే అమలు చేయాలి..




**- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ ప్రభుత్వం పెంచిన కనీస వేతనాలను సిరిసిల్ల అప్పెరల్ పార్కులోని గార్మెంట్ కంపెనీలలో పనిచేస్తున్న కార్మికులకు జూన్ 1వ తేదీ నుండి అమలు చేయాలని సిఐటియు రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో ని బి.వై. నగర్ లోని కామ్రేడ్ అమృత లాల్ శుక్ల కార్మిక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోడం రమణ మాట్లాడుతూ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక శాఖ పరిధిలోని పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని, ఈ పెంచిన వేతనాలు జూన్ 1 నుండి అమలు కానున్నాయ అన్నారు .ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని పెద్దూరు అప్పెరల్ పార్క్ లో ఉన్న గార్మెంట్ కంపెనీల యాజమాన్యాలు కార్మికులందరికీ పెంచిన వేతనాలను వర్తింపజేయాలని అన్నారు . కార్మికుల హక్కులను కాపాడటంలో యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు సూరం పద్మ, జిందం కమలాకర్, దాసరి రూప, బింగి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు..

**- ఎస్పీ మహేష్ బి. గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేసినట్లు ఎస్పీ మహేష్ బి. గితే శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్షలు కూడా విధిస్తామని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 85 మందిపై, అలాగే మద్యం తాగి వాహనాలు నడిపిన 50 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా జిల్లా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే వారిపై నిరంతరం నిఘా ఉంచుతామని, అందులో భాగంగానే ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వెలుతురు తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి, అక్కడ మరింత సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ?రోడ్డు ప్రమాదాల అదుపునకు జిల్లా పరిధిలో ప్రతిరోజూ వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లను స్వాధీనం చేసుకుని, వాటి రద్దు కోసం సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని తెలిపారు.



# వివోఏల నిరవధిక సమ్మె

**బలగం టీవి, బోయినిపల్లి**

గత 20 సంవత్సరాలుగా గ్రామీణ పేదరిక సంస్థలో వెట్టి చాకిరి పనులు చేస్తూ, అదనపు పనులు ఆన్లైన్ వర్క్స్ చేస్తూ, చాలీచాలని జీతంతో పనులు చేస్తూ, వెట్టి చాకిరి చేస్తున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా శ్రమకు తగ్గ వేతనం 20000 ఇవ్వాలని సమ్మె చేస్తున్నారు.అలాగే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ సమ్మెలో భాగంగా మా సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పడం జరిగింది. ఈ సమ్మెలో జిల్లా అధ్యక్షురాలు మంత్రి మనెమ్మ, మండల అధ్యక్షురాలు గుండేటి వరలక్ష్మి, వివో ఏ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.




# జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే ధ్యేయం

**-అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జాప్యం తగదు**

**-టీయూడబ్ల్యూ జే జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టియుడబ్ల్యూజే పని చేస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో యూనియన్ జిల్లా క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ గా సయ్యద్ రసూల్, ఎలక్ట్రానిక్ మీడియా సెక్రటరీగా అడ్డగట్ల మల్లికార్జున్, టి యుడబ్ల్యూజే సంయుక్త కార్యదర్శిగా కమటాల విజయ్ కుమార్ లను నియమిస్తూ నియామక పత్రాలను శని వారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా,ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఇరుకుల్ల ప్రవీణ్ కుమార్, టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సామల గట్టు లు మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం సంఘం అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు .అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను సాధించేంతవరకు యూనియన్ పోరాటం చేస్తుందని అన్నారు .అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరి విషయంలో ప్రభుత్వం జాప్యం తగదని ఎద్దేవా చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల యూనియన్ పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ నాయకత్వం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్నే తృత్వంలో యూనియన్ కార్యకలాపాలను మరింత వేగవంతం చేస్తామన్నారు. నూతనంగా నియమితులైన యూనియన్ బాధ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షునికి ఘన సన్మానం

**బోయినిపల్లి ప్యాక్స్ చైర్మన్ జోగినిపల్లి వెంకటరామారావు ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభలో పాల్గొన్న గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మరియు వార్డ్ సభ్యులు.**

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ కు ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. గ్రామ సీనియర్ నాయకులు వెంకట రామరావు ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా కొదురుపాక గ్రామ ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులు మరియు రజక సంఘం సభ్యులు, స్థానిక కాంగ్రెస్ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా మండల పగ్గాలు చేపట్టిన సువీన్ యాదవ్ కి వారు శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు వెల్లువ కురిపించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ: విద్యావంతుడు, నిబద్ధత కలిగిన యువ నాయకుడు సువీన్ యాదవ్ నేతృత్వంలో బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత పటిష్టంగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సువీన్ యాదవ్ మాట్లాడుతూ: తన నియామకానికి సహకరించిన నాయకులకు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ, అందరినీ సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.




# బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

**- ముస్లిం, గోరక్షక్ సభ్యులతో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బీ.సుమతి**

**బలగం టీవి, హైదరాబాద్**

బక్రీద్ ను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలనీ మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి అన్నారు. శనివారం నేరేట్‌మెట్‌లోని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్‌లో మల్కాజిగిరి మున్సిపాలిటీ, వెటర్నరీ డాక్టర్, రెవెన్యూ, వాటర్ వర్క్స్,ఫైర్ డిపార్ట్మెంట్, మెడికల్, రవాణాశాఖ, పోలీస్ అధికారులతో కలిసి ముస్లిం, గోరక్షక్ సభ్యులతో విడివిడిగా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బక్రీద్ వంటి ముఖ్యమైన పండుగలను పరస్పర సహకారంతో జరుపుకోవడం వల్ల సమాజంలో ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. పండుగ రోజుల్లో ఎలాంటి అపోహలు, వదంతులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

అనుమానాస్పద వాహనాలు, అక్రమరవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై మీ దృష్టిలోకి వస్తే పోలీసులకు సమాచారం ఇచ్చి వారికి సహకరించాలన్నారు. చట్టాన్ని చేతిలో తీసుకోవద్దని కోరారు. గోవులను తరలించే వాహనాలను అడ్డుకోవడం, వ్యక్తులపై దాడులు చేయడం, బలవంతంగా తనిఖీలు చేయడం వంటి చర్యలు పాల్పడరాదని గో రక్షక్ సభ్యులకు సూచించారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరించి, వదంతులను నమ్మకుండా భాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం అనుమతించిన ప్రదేశంలోనే జంతువధ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాలలో జంతు అవశేషాలు ఉంచకుండా పరిశుభ్రత పాటిస్తూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు అనురాధ, సిహెచ్ శ్రీధర్, సురేష్, జీ. నరసింహారెడ్డి, ఉషారాణి, ఇందిరా, శ్రీనివాసులు, శ్యాంసుందర్, అడిషనల్ డీసీపీలు తదితరులు పాల్గొన్నారు.



# క్యాన్సర్ బాధితులకు అండగా జుట్టు దానం చేసిన 11 ఏళ్ల చిన్నారి

**కీమోథెరపీతో జుట్టు కోల్పోయిన వారికి ఆత్మవిశ్వాసం నింపేందుకు ముందుకొచ్చిన ఆధ్యారెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

నాగోల్ జైపురి కాలనీ సమీక్షలోని బాలాజీ ఎన్‌క్లేవ్‌కు చెందిన 11 ఏళ్ల చిన్నారి కొమ్ముri ఆధ్యారెడ్డి తన మానవత్వంతో అందరి ప్రశంసలు అందుకుంది. క్యాన్సర్‌తో పోరాడుతూ కీమోథెరపీ కారణంగా జుట్టు కోల్పోయి మానసిక వేదన అనుభవిస్తున్న చిన్నారులు, మహిళలకు అండగా నిలవాలని భావించి తన పొడవాటి జుట్టును స్వచ్ఛందంగా దానం చేసింది. ఆధ్యారెడ్డి తల్లిదండ్రులు కొమ్ముri దినేష్ రెడ్డి, శిరీష. ఎల్‌బీనగర్‌లోని నారాయణ పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన ఆధ్యారెడ్డి, సమాజంలో క్యాన్సర్ బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తన తల్లి ద్వారా తెలుసుకుంది. టీచర్‌గా పనిచేస్తున్న శిరీష చెప్పిన విషయాలు చిన్నారి మనసును కదిలించాయి. బాధితులకు విగ్గులు తయారు చేయడానికి తన జుట్టు ఉపయోగపడుతుందని తెలుసుకున్న వెంటనే జుట్టు దానం చేయాలని నిర్ణయించుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శనివారం తన జుట్టును కత్తిరించి హైదరాబాద్‌కు చెందిన "ఎయిర్ డోనేషన్" స్వచ్ఛంద సంస్థ ద్వారా క్యాన్సర్ బాధితులకు అందజేసింది. "అందం అంటే కేవలం మన కోసం కాదు.. ఇతరుల ముఖంలో చిరునవ్వు తీసుకురావడం కూడా అందమే" అని ఆధ్యారెడ్డి చెప్పిన మాటలు ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేశాయి. చిన్న వయసులోనే సమాజం పట్ల బాధ్యత, మానవత్వం చాటిన ఆధ్యారెడ్డిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందిస్తున్నారు. రూపం కంటే మంచి మనసే మనిషిని అందంగా మారుస్తుందని పలువురు పేర్కొన్నారు.



# సెంట్రింగ్ కార్మికుల సమస్యలపై వెంటనే చర్చలు జరపాలి

**రెండు రోజుల్లో పరిష్కారం లేకుంటే ధర్నాలో కూర్చుంటా : కల్వకుంట్ల కవిత**

**సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం : ఎమ్మెల్యేలు, సీఐటీయూ నేతలు**

**బలగం టీవి, హైదరాబాద్**

సెంట్రింగ్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని తెలంగాణ రక్షణసేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించకపోతే కార్మికులతో కలిసి తాను కూడా ధర్నాలో కూర్చుంటానని హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద జరుగుతున్న రెండు రోజుల ధర్నాలో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వివేకానంద, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాధవరం కృష్ణారావు, సుధీర్ రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కనిపించే అద్దాల మేడల నిర్మాణంలో సెంట్రింగ్ కార్మికుల కృషి ఎంతో ఉందన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి గాలిలో వేలాడుతూ పనిచేసే కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమన్నారు. హైడ్రా చర్యలతో నోటీసులు లేకుండానే ఇళ్లు కూల్చివేస్తుండటంతో కార్మికుల మెటీరియల్ నష్టపోతున్నా ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వడం లేదని విమర్శించారు. సెంట్రింగ్ కార్మికులు అడుగుతున్న డిమాండ్లు సహేతుకమైనవేనని, ఈఎస్ఐ కార్డులు, స్క్వేర్ మీటర్‌కు రూ.51 చెల్లింపు, ప్రమాద మరణాల పరిహారాన్ని రూ.20 లక్షలకు పెంచాలని కోరుతున్నారని తెలిపారు. తెలంగాణ రక్షణసేన అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని డిమాండ్లను నెరవేర్చుతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు వివేకానంద, తలసాని శ్రీనివాస్, మాధవరం కృష్ణారావు, సుధీర్ రెడ్డి, సీఐటీయూ నేతలు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మిక శాఖ ద్వారా శాశ్వత గుర్తింపు కార్డులు జారీ చేయాలని, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అలాగే ఈఎస్ఐ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు కల్పించాలని, సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనాలపై వెంటనే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. ప్రతి కార్మికుడికి బస్సు పాస్ సౌకర్యం కల్పించడంతో పాటు, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీలో సెంట్రింగ్ కార్మికుల సంఘానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి సెంట్రింగ్ మెటీరియల్ కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, చైర్మన్ పరశురాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ న్యాయవాది దారుణ హత్య

**నెంబర్ ప్లేట్ లేని కారుతో ఢీకొట్టి పరారైన దుండగులు**

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ పరిధిలో శనివారం ఉదయం దారుణ ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్‌పై దుండగులు కారుతో దాడి చేయగా, తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఖాజా మొయినుద్దీన్ శనివారం ఉదయం తన నివాసం నుంచి వ్యక్తిగత పనిమీద బయటకు వెళ్లారు. ఈ సమయంలో ఆయన కదలికలను గమనిస్తున్న ప్రత్యర్థులు నెంబర్ ప్లేట్ లేని కారులో వేగంగా వచ్చి ఆయనను బలంగా ఢీకొట్టారు. ఢీకొట్టిన తర్వాత కూడా కారు ఆపకుండా ఆయనపై నుంచి వెళ్లి దుండగులు అక్కడి నుంచి పరారయ్యారని పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మొయినుద్దీన్‌ను సమీప ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కన్నుమూశారు. భూ వివాదాలు, వక్ఫ్ బోర్డు ఆస్తుల వ్యవహారాల నేపథ్యంలో ఈ హత్య జరిగిన ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





# తెలంగాణ క్రికెట్‌లో 'కొత్త' జోష్..

- అట్టహాసంగా 'టీజీ-20' ఫ్రాంచైజీల వేలం!
- జూన్ 20 నుంచి హెచ్‌సీఏ మెగా లీగ్ ప్రారంభం
- 7.50 కోట్లతో 'హైదరాబాద్' జట్టు అత్యధిక ధం
- రాష్ట్రంలోని 8 జిల్లాల పేర్లతో ఫ్రాంచైజీలు ఖరారు
- జూన్ 7న క్రికెటర్ల వేలం ప్రక్రియ

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ క్రికెట చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం లిఖించబడబోతోంది. రాష్ట్రంలో క్రీడా ముఖచిత్రాన్ని మార్చేస్తూ, సరికొత్త ప్రతిభను వెలికితీసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) శ్రీకారం చుట్టిన ప్రతిష్టాత్మక ఫ్రాంచైజీ ఆధారిత లీగ్ 'టీజీ-20' అడుగులు పడ్డాయి. జూన్ 20 నుంచి ఈ మెగా లీగ్ ప్రారంభం కానుండగా, దీనికి సంబంధించిన ఫ్రాంచైజీల వేలం పాట బేగంపేటలోని ఒక ప్రముఖ హోటల్‌లో అట్టహాసంగా ముగిసింది. తెలంగాణ సంస్కృతి, క్రికెట్ పట్ల ఉన్న మక్కువను ప్రతిబింబించేలా రాష్ట్రంలోని వివిధ జిల్లాల పేర్లతో ఎనిమిది జట్లను ఖరారు చేశారు. ఈ ఫ్రాంచైజీలను దక్కించుకోవడానికి కార్పొరేట్ సంస్థల మధ్య భారీ పోటీ నెలకొంది. ఇందులో అత్యధికంగా 'హైదరాబాద్' ఫ్రాంచైజీ రూ. 7.50 కోట్ల రికార్డు ధరకు అమ్ముడైంది.కోట్లకు పలికిన ఫ్రాంచైజీలు: ఏ జట్టు.. ఎవరికంటే?లీగ్‌లో పాల్గొనే ఎనిమిది జిల్లాల జట్లను కార్పొరేట్ సంస్థలు పోటాపోటీగా వేలంలో దక్కించుకున్నాయి. ఆ వివరాలు కింది పట్టికలో చూడవచ్చు:జట్టు పేరుదక్కించుకున్న సంస్థ / యాజమాన్యంవేలం ధర (రూపాయలలో)హైదరాబాద్ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్7.50 కోట్లురంగారెడ్డిబూరుగు ఇన్‌ఫ్రా మరియు ప్రణవ7.20 కోట్లువరంగల్బైన్ గ్లోబల్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్6.55 కోట్లుమెదక్బృందా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్6.33 కోట్లునల్గొండకిషోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్5.06 కోట్లుకరీంనగర్ఈఐపీఎల్ గ్రూప్ మరియు తిబరుమాల్4.57 కోట్లుమహబూబ్‌నగర్వీరభద్ర స్టీల్స్4.50 కోట్లుఖమ్మంఅన్విత గ్రూప్4.44 కోట్లుయువ ఆటగాళ్లకు 'ఐపీఎల్' తరహా ఎక్స్‌పోజర్తెలంగాణ క్రికెట్‌లో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా టీజీ-20 రూపుదిద్దుకుందని హెచ్‌సీఏ వెల్లడించింది. గ్రామీణ స్థాయి నుంచి క్రికెట్‌ను బలోపేతం చేయడం, వర్ధమాన క్రీడాకారులకు అద్భుతమైన వేదికను కల్పించడం ఈ లీగ్ ముఖ్య ఉద్దేశ్యం. దేశంలోని అగ్రగామి లీగ్ ఐపీఎల్ తరహాలోనే ఇక్కడి యువ ఆటగాళ్లకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ లభించనుంది. ఈ టోర్నీలో తెలంగాణకు చెందిన ప్రతిభావంతులైన యువకులతో పాటు దేశీయ స్టార్ క్రికెటర్లు కూడా బరిలోకి దిగనున్నారు. వీరికి అంతర్జాతీయ అనుభవం ఉన్న కోచ్‌లు, ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకత్వం వహించనున్నారు.'జియో స్టార్' భాగస్వామ్యంతో ప్రత్యక్ష ప్రసారంఈ లీగ్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు హెచ్‌సీఏ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 'జియో స్టార్' భాగస్వామ్యంతో స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఛానల్‌లో మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. అలాగే డిజిటల్ ప్లాట్‌ఫామ్ జియోహాట్‌స్టార్ యాప్‌లోనూ లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది. టోర్నీ నిర్వహణ బాధ్యతలను దేశంలోనే అగ్రగామి స్పోర్ట్స్ మార్కెటింగ్ సంస్థ అయిన 'టీసీఎం స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్' చూస్తుండగా, తమిళనాడు ప్రీమియర్ లీగ్ మాజీ సీఈఓ ప్రసన్న కణ్ణన్‌ను లీగ్ ఎగ్జిక్యూషన్ హెడ్‌గా నియమించారు. ఆటగాళ్లకు ప్రముఖ లగ్జరీ హోటల్ 'మారియట్'లో వసతి కల్పించనున్నారు.ఇది క్రికెట్ భవిష్యత్తుకు సుదీర్ఘ ప్రణాళిక: ఎం.జీవన్ రెడ్డి"టీజీ-20 అనేది కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాదు, ఇది రాష్ట్రంలో క్రికెట్ భవిష్యత్తును సరికొత్తగా తీర్చిదిద్దే ఒక సుదీర్ఘ ప్రణాళిక. మా విజన్‌ను నమ్మి పెట్టుబడులు పెట్టిన ఫ్రాంచైజీ భాగస్వాములకు మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నాం" అని హెచ్‌సీఏ కార్యదర్శి ఎం.జీవన్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే నెల (జూన్) 7న క్రికెటర్ల వేలం నిర్వహించనున్నామని, రాబోయే వారాల్లో జట్ల లోగోలు, ప్లేయర్ డ్రాఫ్ట్, పూర్తి టోర్నమెంట్ షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటిస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు.

# గురుకులాల కిరాణా టెండర్లలో రూ.500 కోట్ల స్కామ్



**సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ బహిరంగ లేఖ**

**బలగం టీవి, హైదరాబాద్**

గురుకులాలు, వసతిగృహాలకు సంబంధించిన కిరాణా టెండర్ల వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 కోట్ల భారీ స్కామ్‌కు తెరలేపిందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. రూ.100 కోట్ల కేంద్రీకృత కమీషన్ల కోసమే కలెక్టర్ల అధికారాలకు కత్తెర పెట్టారని విమర్శించారు.

శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎస్‌కు బహిరంగ లేఖ రాసిన దాసోజు.. ప్రభుత్వం తీసుకున్న కేంద్రీకృత టెండర్ల విధానం వల్ల చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.165 కోట్ల టర్నోవర్ నిబంధన విధించడం ద్వారా స్థానిక వ్యాపారులను పూర్తిగా పక్కనబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ బ్రాండ్‌గా పేరుగాంచిన తాండూర్ కందిపప్పును పక్కనపెట్టి, పేద విద్యార్థులకు నాసిరకం దిగుమతి సరుకులు అందించే పరిస్థితి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు చదువుతున్న గురుకులాలు, హాస్టళ్లకు నిత్యావసరాల కొనుగోళ్లను కేంద్రీకృతం చేయడం నిరంకుశ నిర్ణయమని విమర్శించారు. జిల్లా స్థాయి టెండర్ల ద్వారా ప్రభుత్వ పెద్దలకు 'కిక్‌బ్యాక్స్' రావని భావించి, కలెక్టర్ల ఆధ్వర్యంలోని డీపీసీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని దాసోజు ఆరోపించారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ టెండర్ల వ్యవహారంపై న్యాయ విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. ఈ స్కామ్‌కు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, వెంటనే కేంద్రీకృత టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కమీషన్లు, భూదందాల కోసమే ఫ్యూచర్‌సిటీ

**: దేశపతి శ్రీనివాస్**

**బలగం టీవి, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమీషన్లు, ఆయన సోదరుల భూదందాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీని తెరపైకి తీసుకొచ్చిందని మండలి విప్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో కాంగ్రెస్ నాయకులు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తామని హరీశ్‌రావు ప్రకటించారని తెలిపారు. శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు రాఘవేంద్ర యాదవ్, అమృతలాల్ చౌహాన్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేశపతి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి ఆగిపోయి అరాచకం పెరిగిందని ఆరోపించారు.

మంత్రి శ్రీధర్‌బాబు సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు కోసమే హరీశ్‌రావుపై విమర్శలు చేస్తున్నారని దేశపతి మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఫార్మాసిటీని రద్దు చేసి రైతులకు భూములు తిరిగి ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ముందు ఫార్మాసిటీ రద్దు కాలేదని చెబుతూ, ప్రజల ముందు ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తామని చెప్పడం విరుద్ధ ప్రకటనలని అన్నారు. ప్రగతిభవన్, ధరణి, మెట్రో ప్రాజెక్టులపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు.

**ఫార్మాసిటీ రాష్ట్ర ప్రయోజనాల కోసమే**

కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఫార్మాసిటీని ప్రతిపాదించారని, రైతులను ఒప్పించి భూములు సేకరించారని దేశపతి తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం కమీషన్లు, రియల్ ఎస్టేట్ దందాల కోసమే ఫ్యూచర్‌సిటీ పేరుతో ఫార్మాసిటీని రద్దు చేసిందని ఆరోపించారు. ఫార్మాసిటీ వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఇప్పుడు రైతులు కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఫ్యూచర్‌సిటీ కాదు.. "అవినీతి సిటీ" అని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగితే బీఆర్ఎస్ సహించబోదని హెచ్చరించారు.

అక్రమ మైనింగ్ పేరుతో ప్రజాధనాన్ని దోచుకుంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని బీఆర్ఎస్ రాష్ట్ర నేత గోసుల శ్రీనివాస్ హెచ్చరించారు. తన తండ్రి పేరిట



ఉన్న రాఘవ కన్‌స్ట్రక్షన్ తనది కాదని మంత్రి చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. ఫ్యూచర్‌సిటీ పేరుతో భూదోపిడీ జరుగుతోందని, ఫార్మాసిటీ భూములను ఇతర అవసరాలకు వినియోగించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం ముందుకు సాగుతోందని ఆరోపించారు.

**కాంగ్రెస్‌లో కలవరం : ఎర్రోళ్ల శ్రీనివాస్**

బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తామని హరీశ్‌రావు చేసిన ప్రకటనతో కాంగ్రెస్ నేతల్లో కలవరం మొదలైందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఫ్యూచర్‌సిటీ ముసుగులో భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

ఫార్మాసిటీ భూములను ఇతర అవసరాలకు వినియోగించవద్దనే ప్రాథమిక సూత్రం కూడా తెలియని పొంగులేటి మంత్రి కావడం రాష్ట్ర దురదృష్టమని విమర్శించారు. అక్రమ మైనింగ్, అవినీతి, ప్రజాధన దోపిడీతో కాంగ్రెస్ నేతలు రాష్ట్రాన్ని ముక్కలుగా పంచుకుంటున్నారని మండిపడ్డారు.

# కరీంనగర్ జిల్లాలో అసోం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్లు

**మూడు మండలాల్లో 14 ఎకరాల భూమి కేటాయింపునకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం**

**బలగం టీవి, హైదరాబాద్**

కరీంనగర్ జిల్లాలో అసోం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మూడు మండలాల్లో మొత్తం 14 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ శనివారం తీర్మానం చేసింది. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామంలో అసోం రైఫిల్స్ గ్రూప్ సెంటర్ కోసం ఐదెకరాల భూమిని కేటాయించారు. గన్నేరు మండల కేంద్రంలో బీఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ ఏర్పాటుకు మరో ఐదెకరాలు, మానకొండూర్ మండలంలోని వెల్ది గ్రామంలో సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ కోసం నాలుగెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. త్వరలోనే ఈ కేంద్రాల నిర్మాణ ప్రక్రియ ప్రారంభం కానుంది. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు జిల్లా కలెక్టర్ ఆయా ప్రాంతాల్లో అనువైన ప్రభుత్వ భూములను గుర్తించి నివేదిక సమర్పించగా, రాష్ట్ర కేబినెట్ వాటికి ఆమోదం తెలిపింది.

**గంగాధర డిగ్రీ కళాశాలకు 29 పోస్టుల మంజూరు**

గంగాధర మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు నిర్ణయానికి అనుగుణంగా, ఈ విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభించేందుకు రాష్ట్ర కేబినెట్ 29 పోస్టులను మంజూరు చేసింది. ఇందులో 20 బోధనా సిబ్బంది పోస్టులు, ఆరు బోధనేతర పోస్టులు, మూడు ఔట్‌సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఏడాదే అడ్మిషన్లు చేపట్టి తరగతులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

కరీంనగర్‌లో కేంద్ర బలగాల గ్రూప్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ గత మార్చిలో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. అసోం రైఫిల్స్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటు అంశంపై సంబంధిత విభాగాల డీజీపీలతో కూడా చర్చలు జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే కేంద్రం సెంటర్ల ఏర్పాటును పరిశీలిస్తుందని అధికారులు తెలిపిన నేపథ్యంలో, ప్రభుత్వం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి కేబినెట్‌కు పంపింది. అనంతరం కేబినెట్ మొత్తం 14 ఎకరాల భూమి కేటాయింపుకు ఆమోదం తెలిపింది.

## శ్రేయస్ 'శతక' గర్జన..

# పంజాబ్ ఆశలు సజీవం!

**లక్నోపై 7 వికెట్ల తేడాతో ఘన విజయం**

**ఆరు ఓటముల తర్వాత ఎట్టకేలకు బ్రేక్**

**ప్లేఆఫ్స్ రేసులో కింగ్స్.. లక్నో కథ ముగిసే**




**బలగం టీవీ, లక్నో**

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఎట్టకేలకు తమ పరాజయాల పరంపరకు బ్రేక్ వేసింది. వరుసగా ఆరు ఓటముల తర్వాత ఊపిరి పీల్చుకుంటూ ఘన విజయాన్ని నమోదు చేసింది. శనివారం ఇక్కడి ఏకానా స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన శ్రేయస్ అయ్యర్ (104 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (69) అర్ధసెంచరీతో అండగా నిలిచాడు. ఈ గెలుపుతో పంజాబ్ కింగ్స్ తమ ప్లేఆఫ్స్ అవకాశాలను గణిత సమీకరణాల పరంగా సజీవంగా ఉంచుకుంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ ఈ సీజన్‌ను ఓటమితో ముగించింది. 14 మ్యాచ్‌ల్లో కేవలం 4 విజయాలతో లక్నో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది.

**లక్నో భారీ స్కోరు.. రాణించిన ఇంగ్లీస్**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ జోష్ ఇంగ్లీస్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సలతో 72) హాఫ్ సెంచరీతో జట్టుకు మంచి పునాది వేశాడు. ఆఖరిలో ఆయుష్ బదోని (18 బంతుల్లో 43), అబ్దుల్ సమద్ (20 బంతుల్లో 37 నాటౌట్) ధాటిగా ఆడటంతో లక్నో గౌరవప్రదమైన స్కోరు సాధించింది. పంజాబ్ బౌలర్లలో మార్కో జాన్సెన్, యుజ్వేంద్ర చాహల్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

**అయ్యర్ జోరు.. ప్రభ్‌సిమ్రాన్ బేజారు**

197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. వేగంగా వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన దశలో శ్రేయస్ అయ్యర్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ జట్టును ఆదుకున్నారు. లక్నో బౌలర్లను సునాయసంగా ఎదుర్కొంటూ బౌండరీల వర్షం కురిపించారు. ముఖ్యంగా శ్రేయస్ అయ్యర్ కేవలం 51 బంతుల్లోనే 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 104 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (39 బంతుల్లో 69) అతనికి చక్కని సహకారం అందించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను లక్నో చేతుల్లోంచి లాగేసుకున్నారు. దీనితో పంజాబ్ 18 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసి సునాయస విజయాన్ని అందుకుంది.

**కొంపముంచిన పంత్ క్యాచ్ డ్రాప్!**

196 పరుగుల లక్ష్య ఛేదనలో మహమ్మద్ షమీ పంజాబ్ ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (0), కూపర్ కానల్లీ (18)లను త్వరగానే పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో అర్జున్ టెండూల్కర్ వేసిన ఏడో ఓవర్‌లో ఒక కీలక మలుపు చోటుచేసుకుంది. 20 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ప్రభ్‌సిమ్రాన్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను వికెట్ కీపర్ రిషభ్ పంత్ నేలపాలు చేశాడు. ఒకవేళ ఆ క్యాచ్ పట్టి ఉంటే మ్యాచ్ లక్నో వైపు తిరిగేది. ఈ లైఫ్ లైన్‌తో చెలరేగిన ప్రభ్‌సిమ్రాన్ లక్నో పతనాన్ని శాసించాడు.

**ప్లేఆఫ్స్ సమీకరణం ఇలా..**

ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఆదివారం జరగబోయే మ్యాచ్‌ల్లో ముంబై ఇండియన్స్ చేతిలో రాజస్థాన్ రాయల్స్, అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో కోల్‌కతా నైట్ రైడర్స్ (ఖఖక్మ) ఓడిపోతే.. పంజాబ్ కింగ్స్ నెట్ రన్ రేట్ ఆధారంగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉంటుంది.

**సంక్షిప్త స్కోరు బోర్డు:**

లక్నో సూపర్ జెయింట్స్: 20 ఓవర్లలో 196/6 (జోష్ ఇంగ్లీస్ 72, ఆయుష్ బదోని 43; మార్కో జాన్సెన్ 2/??, యుజ్వేంద్ర చాహల్ 2/??)

పంజాబ్ కింగ్స్: 18 ఓవర్లలో 200/3 (శ్రేయస్ అయ్యర్ 104 నాటౌట్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ 69; మహమ్మద్ షమీ 2/45, అర్జున టెండూల్కర్ 1/36)

ఫలితం: పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో విజయం. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్: శ్రేయస్ అయ్యర్.




# సన్ రైజర్స్ ఐపీఎల్ టైటిల్ సాధించేనా?

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఆఖరి అంకానికి చేరుకుంది. ఆదివారం జరిగే డబుల్ హెడర్ పోరుతో లీగ్ దశ ముగియనుంది. ప్రస్తుతం మరో 2 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఆదివారం జరిగే డబుల్ హెడర్‌లో కేకేఆర్‌తో ఢిల్లీ క్యాపిటల్స్.. రాజస్తాన్ రాయల్స్‌తో ముంబై ఇండియన్స్ జట్లు తలపడతాయి. ఇప్పటికే ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు ప్లే ఆఫ్స్ చేరుకున్నాయి. ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ జట్లు టాప్ 2లో నిలిచాయి. ఇక ఆర్సీబీపై తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నెగ్గినా మెరుగైన నెట్ రన్ రేట్ లేకపోవడంతో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. టాప్ 2లో నిలిచిన జట్లకు ఫైనల్ చేరేందుకు రెండు అవకాశాలు ఉంటాయి.ఇక 3, 4వ స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరాలంటే వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గాల్సిందే. అయితే ఇలాంటి స్థితిలో నిలవడం సన్ రైజర్స్ హైదరాబాద్‌కు ఇదేం తొలిసారి కాదు. 2016లో కూడా ఇలాంటి పరిస్థితినే సన్ రైజర్స్ హైదరాబాద్ ఎదుర్కొంది. 2016 ఐపీఎల్‌లో గుజరాత్ లయన్స్.. ఆర్సీబీ జట్లు వరుసగా టాప్ 2లో నిలిచాయి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మూడు.. కేకేఆర్ 4వ స్థానంలో నిలిచాయి. క్వాలిఫయర్ 1లో గుజరాత్ లయన్స్‌పై ఆర్సీబీ నెగ్గి ఫైనల్ చేరగా.. కేకేఆర్ ను ఓడించిన సన్ రైజర్స్ హైదరాబాద్ క్వాలిఫయర్ 2కు అర్హత సాధించింది. అనంతరం క్వాలిఫయర్ 2లో గుజరాత్ లయన్స్‌పై నెగ్గింది. అనంతరం ఫైనల్లో ఆర్సీబీని ఓడించి టైటిల్ సాధించింది. ఆ సమయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా ప్లేయర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు.ఈసారి కూడా ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఉన్నాడు. 2016లో మాదిరే ఈసారి కూడా ఆర్సీబీ, గుజరాత్, సన్ రైజర్స్ జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరాయి. కేకేఆర్ రేసులో ఉంది. కేకేఆర్ కూడా ప్లే ఆఫ్స్‌కు చేరితే అచ్చం 2016 సీజన్‌లానే ఉంటుంది. 2016 సెంటిమెంట్ వర్కౌట్ అయితే ప్యాట్ కమిన్స్ నేతృత్వంలోని సన్ రైజర్స్ హైదరాబాద్ కప్పు నెగ్గడం ఖాయం.ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మే 27న జరిగే ఎలిమినేటర్ పోరులో తలపడనుంది. అయితే ప్రత్యర్థి ఇంకా డిసైడ్ కాలేదు. ప్రస్తుతం సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో బ్యాటర్లు సూపర్ ఫామ్‌లో ఉన్నారు. అభిషేక్ శర్మ, క్లాసెన్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డిలు సూపర్ టచ్‌లో ఉన్నారు. ఇక బౌలింగ్ కూడా మెరుగైంది. ప్యాట్ కమిన్స్, సకీబ్ హుస్సేన్, ఈషాన్ మలింగలు లయలో ఉన్నారు.వీరు క్వాలిఫయర్స్‌లో కూడా రాణిస్తే సన్ రైజర్స్ హైదరాబాద్ ఫైనల్ చేరడం ఖాయం. ఆర్సీబీతో మరోసారి పోరు జరిగితే మాత్రం అభిమానులు పండగ చేసుకోవడం ఖాయం. మే 31న అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్ జరగనుంది.

# రెజ్లర్ వినేష్ ఫొగాట్‌కు భారీ ఊరట



**బలగం టీవీ, హైదరాబాద్**

గత కొంతకాలం నుంచి వివాదాల్లో చిక్కుకున్న భారత స్టార్ రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. మే 30 నుంచి జరగనున్న ఏషియన్ గేమ్స్ 2026 సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు మహిళా రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు ఢిల్లీ హైకోర్టు అనుమతి ఇచ్చింది. వినేష్ ఫోగాట్ వంటి మహిళా రెజ్లర్లను దూరం పెట్టడానికి మాతృత్వం (తల్లి కావడం) ఒక ప్రాతిపదిక కాకుండా చట్టం చూసుకుంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఆసియా క్రీడలకు భారత రెజ్లింగ్ సమాఖ్య నిర్దేశించిన ప్రమాణాలు వివక్షపూరితంగా ఉన్నాయని ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కారియాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒక మహిళా రెజ్లర్ గర్భధారణ, ప్రసవానంతర కాలం నాటి ప్రయాణం అసాధారణమైన శారీరక సవాళ్లతో కూడి ఉంటుందనే విషయాన్ని తిరస్కరించలేమని హైకోర్టు పేర్కొంది. అయితే దీని తీవ్రతను క్రీడా రంగంలో తరచుగా గుర్తించరని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. వినేష్ ఫోగాట్ వంటి మహిళా అథ్లెట్లను దూరం పెట్టడానికి మాతృత్వం కారణం కాకూడదని న్యాయమూర్తి పేర్కొన్నారు. 'వినేష్ ఫోగాట్ ప్రసూతి సెలవులో ఉన్నందున భారత రెజ్లింగ్ సమాఖ్య మినహాయింపు సెలక్షన్ పాలసీని పూర్తి చేయలేకపోయారు. వినేష్ ఫోగాట్ వంటి మహిళా అథ్లెట్లను బహిష్కరించడానికి లేదా పక్కన పెట్టడానికి మాతృత్వం కారణం కాకూడదని' ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. రెజ్లర్ వినేష్ ఫోగాట్‌కు జారీ చేసిన షోకాజ్ నోటీసుపై కూడా ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ చర్యను ద్వేషపూరితమైనదిగా కోర్టు అభివర్ణించింది. ఆమె విషయంలో పదాల ఎంపికపై సైతం కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వైపు నుంచి దురుద్దేశం ఉందని స్పష్టంగా అర్థమవుతోందని కోర్టు వ్యాఖ్యానించడం హాట్ టాపిక అవుతోంది. 2025లో మెడల్స్ గెలిచిన వారికే అర్హతను పరిమితం చేసేలా నిబంధనలు ఉన్నాయని ధర్మాసనం తప్పుపట్టింది.

# సన్ రైజర్స్ ప్రపంచ రికార్డు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉప్పల్ వేదికగా శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఈ క్రమంలో ఓ టీ20 టోర్నమెంట్‌లో ఓ సీజన్‌లో అత్యధిక సార్లు 200 ప్లస్ పరుగులు సాధించిన జట్టుగా చరిత్ర సృష్టించింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ ఇప్పటి వరకు 9 సార్లు 200 ప్లస్ పరుగులు చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్నారు. ఈ క్రమంలో కోల్‌కతా నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌పై రెండేసి సార్లు, ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై ఒక్కోసారి 200కి పైగా పరుగులు సాధించింది.

# కోహ్లీ వండర్ఫుల్ రికార్డు

**బలగం టీవీ, హైదరాబాద్**




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ 2026 సీజన్ లో భాగంగా శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్ లో ఒక అద్భుతమైన ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్ లో వెంకటేష్ అయ్యర్‌తో కలిసి ఓపెనింగ్ వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన కోహ్లీ, ఓవరాల్ గా టీ20 క్రికెట్ లో 211వ సారి యాభై లేదా అంతకంటే ఎక్కువ పరుగుల పార్ట్‌నర్‌షిప్‌లో భాగమయ్యాడు. ఈ ఘనతతో మెన్స్ టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక యాభై ప్లస్ భాగస్వామ్యాల్లో నిలిచిన ప్లేయర్‌గా కోహ్లీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ లిస్ట్ లో ఇంగ్లండ్ మాజీ బ్యాటర్ అలెక్స్ హేల్స్ (210) రికార్డును ఆయన అధిగమించాడు. వెస్టిండీస్ లెజెండ్ క్రిస్ గేల్ 191 భాగస్వామ్యాలతో ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు.ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డారు. నిర్ణీత 20 ఓవర్లలో ఎస్ఆర్‌హెచ్ 4 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచింది. ఓపెనర్ అభిషేక్ శర్మ 56 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, మిడిలార్డర్ లో ఇషాన్ కిషన్ 79 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచారు. హెన్రిచ్ క్లాసెన్ 51 పరుగులతో రాణించాడు. ఇషాన్ కిషన్, క్లాసెన్ మూడో వికెట్‌కు కేవలం కొద్ది ఓవర్లలోనే 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించి ఆర్సీబీ బౌలింగ్ లైన్‌అప్‌ను దెబ్బతీశారు. బెంగళూరు బౌలర్లలో రసీఖ్ సలామ్ దార్ 52 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు.ఇన్నింగ్స్ బ్రేక్ సమయంలో సన్‌రైజర్స్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్ మాట్లాడుతూ, మొదట్లో టైమింగ్ దొరకక కొంచెం ఇబ్బంది పడ్డానని అంగీకరించాడు. జోష్ హేజిల్‌వుడ్ వేసిన ఒకే ఓవర్ లో 27 పరుగులు రావడంతో తన ఇన్నింగ్స్ ట్రాక్‌లోకి వచ్చిందని చెప్పాడు. టీమ్ రన్ రేట్ వేగంగా ఉన్నప్పుడు క్రీజులో ఎక్కువ బంతులు వేస్ట్ చేయలేమని, అందుకే గేర్ మార్చాల్సి వచ్చిందని వివరించాడు. ఈ సీజన్ లో మిడిలార్డర్ లో ఇషాన్ కిషన్‌తో కలిసి మంచి పార్ట్‌నర్‌షిప్స్ బిల్డ్ చేయడం జట్టుకు బాగా ప్లస్ అయిందని క్లాసెన్ పేర్కొన్నాడు. పిచ్ కాస్త స్లోగా ఉన్నప్పటికీ బ్యాటింగ్ కు అనుకూలించిందని అభిప్రాయపడ్డాడు.సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండు జట్లు ఇప్పటికే ప్లేఆఫ్స్ బెర్త్‌లను కన్ఫర్మ్ చేసుకోవడంతో ప్లేయర్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఫ్రీ మైండ్‌తో ఆడారు. మ్యాచ్ ఫలితం ఎలా ఉన్నా సరికొత్త ప్రయోగాలు చేయడానికి ఈ మ్యాచ్ పనికొచ్చిందని క్లాసెన్ చెప్పాడు. ఇంతటి భారీ స్కోరు సాధించడం వల్ల ఛేజింగ్ లో ప్రత్యర్థి జట్టు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని విశ్లేషించాడు.

# విరాట్ కోహ్లీపై నెటిజన్లు ఫైర్!



**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ వేదికగా ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ మధ్య జరిగిన మ్యాచ్ వన్‌సైడెడ్‌గా సాగినా గ్రౌండ్‌లో జరిగిన డ్రామా మాత్రం చర్చకు దారితీస్తోంది. కోహ్లీ బ్యాటింగ్ చేసినప్పుడు హెడ్ కవ్విస్తూ కామెంట్స్ చేశాడు. అప్పుడే విరాట్ సీరియస్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా హెడ్ షేక్ హ్యాండ్ ఇస్తే పట్టించుకోకుండా విరాట్ వెళ్లిపోయాడు. ఇప్పుడు దీన్నే నెటిజన్లు తప్పుబడుతున్నారు. ఇది అహంకార పూరితమైన ప్రవర్తన అని కామెంట్స్ చేస్తున్నారు. ఉప్పల్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఓపెన్ అభిషేక్ శర్మ(56) ఇషాన్ కిషన్(79) మెరుపు ఆరంభాన్ని ఇచ్చారు. చివర్లో హెన్రిచ్ క్లాసెన్ (51) తన స్టైల్‌లో ఇన్నింగ్స్ ముగించాడు. బెంగళూరు బౌలర్లు హైదరాబాద్ బ్యాటర్లను అడ్డుకోవడంలో విఫలమయ్యారు. 256 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు ఇన్నింగ్స్ సమయంలో అసలు డ్రామా మొదలైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రీజులో ఉన్నప్పుడు చాలా దూకుడుగా కనిపించాడు. వరుసగా ఫోర్లు బాదిన తర్వాత కోహ్లీ ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్ ట్రావిన్స్ హెడ్‌ను ఉద్దేశించి వచ్చి బౌలింగ్ చేయ్ అన్నట్టు కామెంట్ చేశాడు. దీనికి సమాధానంగా హెడ్ కేవలం చిరునవ్వుతోనే బదులిచ్చాడు. అయితే ఈ మాటల యుద్ధం కోహ్లీకి కలిసి రాలేదు. కేవలం 15 పరుగులు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు పెట్టింది." వచ్చాడు, బౌలింగ్ చేశాడు, వికెట్ పడగొట్టి వెళ్లిపోయాడు" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. నిజానికి ట్రావిన్స్ హెడ్ బౌలింగ్‌కు వచ్చి ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ తీశాడు. కోహ్లీ హెడ్‌ను బౌలింగ్ చేయమని సవాల్ చేసినందున ఈ పోస్టు కోహ్లీని ఉద్దేశించిందేనని అభిమానులు భావిస్తున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా కోహ్లీ కోపం తగ్గలేదు. పెవిలియన్ నుంచి వస్తూ అందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చాడు కోహ్లీ. కానీ ట్రావిన్స్ హెడ్‌తో చేతులు కలపకుండా పక్కకు తప్పుకొని వెళ్లిపోయాడు. దీనికి హెడ్ కూడా షాక్ అయ్యి నవ్వి ముందుకెళ్లిపోయాడు. దీనిపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మైదానంలో జరిగిన విషయాలను ఇలా సీరియస్‌గా తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రేపో మాపో రిటైర్ కాబోతున్నా కూడా మెచ్యూరిటీ రాలేదా అని ఎద్దేవా చేస్తున్నారు. మరికొందరు కోహ్లీ అహంకారపూరితంగా వ్యవహరించారని అంటున్నారు. ఆ వ్యక్తి యాటిట్యూడే అలా ఉంటుందని, నచ్చితే మాట్లాడుతాడు లేకుంటే అసలు పట్టించుకోడని అంటున్నారు. ఈ మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో బెంగళూరు విఫలమైంది. దీంతో ఎస్ఆర్‌హెచ్ 55 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆర్సీబీ తరఫున వెంకటేష్ అయ్యర్ 44 పరుగులు, రజత్ పాటిదార్ 56 పరుగులు, కృనాల్ పాండ్యా 41 పరుగులు చేశాడు. ఈ ఓటమి బెంగళూరుకు పెద్దగా నష్టం చేయలేదు. మెరుగైన రన్‌రేటు కారణంగా పాయింట్ల పట్టికలో ఆర్సీబీ టాప్2లో ఉంది. నేరుగా క్వాలిఫైయర్ 1కు అర్హత సాధించింది. క్వాలిఫైయర్ 1లో గుజరాత్‌టైటాన్స్‌తో తలపడనుంది.





# సచిన్‌లో చూసిందే వైభవ్‌లో కనిపించింది

**భారత మాజీ క్రికెటర్ కిరణ్ మోరే**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ కిరణ్ మోరే ప్రశంసల జల్లు కురిపించాడు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్‌లో చూసిన తెగువ తనకు వైభవ్ సూర్యవంశీలో కనిపించిందని తెలిపాడు. వరల్డ్ క్లాస్ బౌలర్లను సైతం అలవోకగా ఎదుర్కొంటుండటం తనను విపరీతంగా ఆకట్టుకుందన్నాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతున్నాడు. 13 ఇన్నింగ్స్‌లలో 44.54 సగటు, 236.32 స్ట్రైక్‌రేట్‌తో 579 పరుగులు చేశాడు. ఆరెంజ్ క్యాప్ రేసులో కొనసాగుతున్నాడు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ 53 సిక్సర్లు బాదాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఒక సీజన్‌లో భారత బ్యాటర్ కొట్టిన అత్యధిక సిక్స్‌లు ఇవే కావడం గమనార్హం.తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైభవ్ ఆటతీరుపై స్పందించిన కిరణ్ మోరే.. సచిన్‌తో పోల్చుతూ బుడ్డోడిని ఆకాశానికెత్తాడు. 'నేను తొలిసారి సచిన్ టెండూల్కర్‌ను చూసినప్పుడు అతను వరల్డ్ క్లాస్ బౌలర్లను ఎలా ఎదుర్కొన్నాడో నాకు ఇప్పటికీ గుర్తుంది. అప్పుడే నాకు అర్థమైంది సచిన్ చాలా ప్రత్యేకమైన ఆటగాడు అని. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే నాకు మళ్లీ అదే ఫీలింగ్ కలుగుతోంది. వైభవ్ కూడా చాలా ప్రత్యేకమైన ఆటగాడు. దేవుడే అతన్ని క్రికెట్ కోసం ప్రత్యేకంగా తయారు చేసి పంపినట్లున్నాడు. వైభవ్‌ను తన సహజ సిద్ధమైన శైలిలోనే ఆడనివ్వండి.. దేశానికి గొప్ప పేరు తెస్తాడు." అంటూ ప్రశంసల వర్షం కురిపించారు.ఇటీవల ముగిసిన అండర్ 19 ప్రపంచ కప్‌లో వైభవ్ సూర్యవంశీ 7 మ్యాచ్‌ల్లో 439 పరుగులు చేశాడు. ఆ టోర్నీలో 30 సిక్సర్లు బాది డెవాల్డ్ బ్రెవిస్ రికార్డును బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో ఇప్పటివరకు 31 మ్యాచ్‌ల్లో 1280 పరుగులు చేసి 4 శతకాలు నమోదు చేశాడు.ఈ అద్భుత ప్రదర్శన నేపథ్యంలోనే వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే భారత సెలెక్టర్లు వైభవ్ సూర్యవంశీని శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత్-ఏ జట్టుకు ఎంపిక చేశారు.

# లేడీ ఫ్యాన్‌కు 'సారీ' చెప్పిన రోహిత్ శర్మ

**బలగం టీవీ, హైదరాబాద్**



రోహిత్ శర్మ అంటే అభిమానులకు ఎప్పుడూ ప్రత్యేకమే. అలాగే అభిమానులంటే కూడా రోహిత్?కు స్పెషలే. మరోసారి దీనిని హిట్?మ్యాన్ నిరూపించుకున్నాడు. ఇంతటీ బడా స్టార్ క్రికెటర్ అయినప్పటికీ, తాజాగా ఓ లేడీ ఫ్యాన్?కు రోహిత్ 'సారీ'? చెప్పాడు. తనను కలవలేకపోయాననని ఏడుస్తూ బాధపడుతున్న ఓ యువతి కోసం రోహిత్ వీడియో సందేశం పంపించాడు. మళ్లీ కోల్?కతాకు వచ్చినప్పుడు ఆ అమ్మాయిని తప్పకుండా కలుస్తానంటూ వీడియోలో చెప్పుకొచ్చాడు. దీంతో ఆ అమ్మాయి ఆనంధానికి అవుధుల్లేకుండా పోయాయి!కోల్?కాతా ఈడెన్ గార్డెన్స్?? వేదికగా ముంబయి రీసెంట్?గా కేకేఆర్?తో మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్ సందర్భంగా రోహిత్?ను కలవాలని ఓ లేడీ ఫ్యాన్ స్టేడియానికి వెళ్లింది. హిట్?మ్యాన్?ను కలిసేందుకు కొన్ని గంటల నుంచి వెయిట్ చేస్తున్నానని, అతడని కలవడమే తన డ్రీమ్ అని చెప్పింది. అయితే డ్రెస్సింగ్ రూమ్ నుంచి ప్లేయర్లు ఒక్కొక్కరు వస్తుండగా రోహిత్ కోసం ఆత్రుతగా ఎదురుచూసింది. అతడు రాగానే 'రోహిత్ భాయ్', 'రోహిత్ భాయ్' అంటూ గట్టిగా అరిచింది. అయితే క్రౌడ్ శబ్దం వల్ల రోహిత్ ఆమెను పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. అంతే ఒక్కసారిగా ఆ యువతి ఏడ్చేశింది. ఈ మొత్తం సన్నివేశాన్ని పక్కనే ఉన్న ఆమె బంధువు వీడియో రికార్డ్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో రోహిత్? దాకా చేరింది. అయితే తనను కలవలేకపోయానన్న బాధతో ఆ ఆమ్మాయి ఏడవడం రోహిత్?ను కలచివేసినట్లుంది. దీంతో ఆమెకు సారీ చెబుతూ హిట్?మ్యాన్ ఓ వీడియో చేశాడు. 'హాయ్, జినియా! ఈడెన్ గార్డెన్స్?లో నిన్ను కలవలేకపోయినందుకు నన్ను క్షమించు. నీ వీడియో చూశాను. నాకూ బాధేసింది. అయితే క్రౌడ్ ఎక్కువగా ఉండడం వల్ల కొన్నిసార్లు ఎవరు పిలుస్తున్నారో గుర్తుపట్టడం కష్టంగా ఉంటుంది. నేనూ అలాగే మిస్ అయినట్లు ఉన్నాను. కానీ, నెక్ట్స్ ఈడెన్ గార్డెన్స్?కు వచ్చినప్పుడు మాత్రం నిన్ను కచ్చితంగా కలుస్తాను' అని వీడియో షేర్ చేశాడు. ఈ వీడియో ఓ అభిమాని ద్వారా సదరు యువతికి చేరింది. తన వీడియోకు రోహిత్? రెస్పాన్స్ ఇవ్వడంతో హ్యాపీగా ఫీల్ అయ్యింది. మహిళా అభిమానికి సారీ చెబుతూ రోహిత్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. ఆయన రేంజ్? స్టార్ అభిమానికి సారీ చెప్పడంతో హిట్?మ్యాన్?పై ప్రశంసలు కురుస్తున్నాయి. రోహిత్ తన అభిమానులను ఎప్పుడూ నిరాశ పర్చడని, అతడి బంగారం అంటూ పోస్టులు షేర్ చేస్తున్నారు. ఇక ప్రస్తుత ఐపీఎల్? సీజన్?లో ముంబయికి ఇంకా ఒక మ్యాచే మిగిలింది. ఆదివారం (మే 24) మధ్యాహ్నం 3.30 గంటలకు రాజస్థాన్ రాయల్స్?తో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్?కు ముంబయి వాంఖడే స్టేడియం వేదిక కానుంది. ఇది ముంబయికి పెద్దగా అవసరం లేకున్నా, రాజస్థాన్?కు మాత్రం కీలకమైన మ్యాచ్. ప్లేఆఫ్స్?కు చేరుకోవాలంటే ఈ మ్యాచ్?లో తప్పక నెగ్గాల్సిందే! ప్రస్తుతం 14 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ 16 పాయింట్లతో బెర్త్ ఖరారు చేసుకుంటుంది. ఒకవేళ ఓడితే పంజాబ్ కింగ్స్, కోల్?కతా నైట్?రైడర్స్?కు ఛాన్స్ ఉంటుంది.రోహిత్ ఈ మ్యాచ్?లో బరిలో దిగనున్నాడు. ఇప్పటిదాకా 8 మ్యాచ్?లు ఆడిన హిట్?మ్యాన్ 283 పరుగులు చేశాడు. ఇందులో రెండుసార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. ఇక ఆఖరి మ్యాచ్?లో రాజస్థాన్?పైనా భారీ ఇన్నింగ్స్?తో చెలరేగిపోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ మ్యాచ్ తప్పితే మళ్లీ వచ్చే ఏడాదే రోహిత్ టీ20ల్లో కనిపిస్తాడు.


# ఎఐతో నకిలీ బికినీ ఫోటలు



## నెట్టింట వైరల్ కావడంపై నటి రుక్మిణీ ఆగ్రహం

'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబం ధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా కనిపించడంపై న టి రుక్మిణీ వసంత్ ఆగ్రహం చెందారు. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్ లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటి జన్లను ఒక్కసారిగా ఆశ్చర్యా నికి గురిచేశా యి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా ఎఐ ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొ న్నారు. బాధ్యతా రాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# 200 కోట్లు రాబట్టిన కరుప్ప




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు' తెలుగులో 'వీరభద్రుడు' బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్ష కుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన వారం రోజుల్లోనే 'కరుప్పు' ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి.గత తొమ్మిది నెలలుగా తమిళనా డులో ఏసినిమా అందుకోలేని అరుదైన ఘనతను 'కరుప్పు' సాధించింది. కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్టిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం వచ్చినప్పటికీ, తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైన సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది.

# పెద్ది విజయంపైనే రామ్‌చరణ్ ఆశలు



## బుచ్చిబాబు దర్శకత్వానికి కూడా సవాలే

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.... ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తరువాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. దీంతో ఇప్పుడు చరణ్ కెరీర్‌లో రాబోయే రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకంగా మారాయి. ఆచార్యలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఆ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన గేమ్ ఛేంజర్ కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. స్టార్ దర్శకుడు, భారీ బ్జడెట్, భారీ తారాగణం ఉన్నప్పటికీ సినిమా ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేక పోయింది. దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ చరణ్ తదుపరి చిత్రం 'పెద్ది'పై నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్, పాటలు, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా చరణ్ మాస్ లుక్, రగ్గడ్ బాడీ లాంగ్వేజ్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా కాలం తర్వాత ఆయనను పూర్తి స్థాయి మాస్ పాత్రలో చూడబోతున్నామనే అంచనాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి. బుచ్చిబాబు తన తొలి చిత్రం ఉప్పెన తోనే దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భావోద్వేగాలను బలంగా తెరపై చూపించడంలో ఆయన ప్రత్యేక శైలి ఉందని సినీ విశ్లేషకులు చెబుతుంటారు. అదే ఎమోషనల్ టచ్ 'పెద్ది'లో కూడా కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. ఇక 'పెద్ది' తర్వాత చరణ్ చేయబోయే సినిమా మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎందుకంటే ఆ చిత్రానికి దర్శకత్వం వహించబోయేది సుకుమార్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన రంగస్థలం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ముఖ్యంగా చిట్టిబాబు పాత్రలో చరణ్ నటనకు భారీ ప్రశంసలు వచ్చాయి. ఆ సినిమా ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది.

ఇప్పుడు మరోసారి అదే కాంబినే షన్ రిపీట్ అవుతుండటంతో అభిమా నుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఒకవేళ 'పెద్ది' భారీ విజయాన్ని అందుకుంటే ఆయన మాస్ ఇమేజ్ మరింత బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత సుకుమార్ సినిమా కూడా విజయవంతమైతే గ్లోబల్ స్టార్‌గాఆయన మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నాగార్జునకు మే 23 స్పెషల్




## తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు

తన జీవితంలో 'మే 23' ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. 'విక్రమ్' నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా' అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం 'విక్రమ్' 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన 'హీరో' సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. 'కింగ్ 100'అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, 'కూలీ'లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా 'కింగ్ 100' ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.

# అఖిల్ లెనిన్ టీజర్ విడుదల




## అక్కినేని అభిమానుల్లో ఉత్సాహం

అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా అనౌన్స్‌మెంట్‌తో మంచి అంచనాలు ఏర్పడగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది.ఈ సినిమా జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రత్యేక సందర్భంగా, 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ ఎలిమెంట్స్ కూడా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మనోడు వస్తున్నాడు? నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా? అంటూ అఖిల్ చెప్పిన డైలాగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ డైలాగుల్లో కనిపించిన యాటిట్యూడ్, స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక టీజర్ విడుదలపై నాగార్జున కూడా స్పందించారు. తనకు ఈ టీజర్ ఒక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. టీజర్ మొత్తం ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా అనిపించిందని అభిప్రాయపడ్డారు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న ఆయనకు 'లెనిన్' మంచి మైలురాయిగా మారుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తుంటే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# అనిరుధ్‌తో లవ్‌లో కావ్య మారన్



## త్వరలోనే వెడ్డింగ్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య మారన్‌కు సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ఆమె హావభావాలు, రియాక్షన్స్ తరచూ వైరల్ అవుతూ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించాయి. అభిమానులు ప్రేమగా 'కావ్య పాప' అని పిలుచుకునే ఆమెకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కావ్య మారన్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగు పెట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతేకాదు, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్‌తో ఆమె పెళ్లి జరగబోతుందనే వార్తలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. అయితే ఈ ప్రచారం కొత్తది కాదు. గత ఏడాది నుంచే కావ్య మారన్, అనిరుధ్ మధ్య సాన్నిహిత్యం ఉందంటూ సోషల్ మీడియాలో పుకార్లు వినిపించాయి. ముఖ్యంగా ఇద్దరూ న్యూయార్క్‌లో కలిసి కనిపించారనే వార్తలు రావడంతో డేటింగ్ రూమర్స్ మరింత ఊపందుకున్నాయి. అప్పటి నుంచి వీరిద్దరి గురించి అనేక కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు మరోసారి కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం, ఇరువురి కుటుంబ సభ్యులు ఈ వివాహానికి అంగీకారం తెలిపారని, విదేశాల్లో వివాహం జరిపించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నాయని సమాచారం. వివాహం అనంతరం చెన్నైలో ఘనంగా రిసెప్షన్ నిర్వహించే ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయనే ప్రచారం నడుస్తోంది. ఇదిలా ఉండగా మరో ఆసక్తికర విషయం కూడా చర్చనీయాంశమైంది. అనిరుధ్‌కు కుటుంబ సంబంధాలు ఉన్న సినీ ప్రముఖులు ఈ వివాహం కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారనే కథనాలు తమిళ మీడియా వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు కావ్య మారన్ క్రీడా, వ్యాపార వ్యవహారాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఈ వివాహ వార్తలపై అటు కావ్య మారన్ కుటుంబం కానీ, ఇటు అనిరుధ్ వర్గాలు కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

